తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM కరీంనగర్ : fb.com/vaartha

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

22-9-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 235 పేజీలు: 8+16 వెల: 8.00





ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కరీంనగర్ : fb.com/vaartha

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Palamuru, Tadepalligudem, Srikakulam

22-9-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 235 పేజీలు: 8+16 వెల: 8.00

## మూసీ ప్రక్షాళనకు రెడీ.. రంగంలోకి హైడ్రా

## 28న రాష్ట్రపతి ముర్ము హైదరాబాద్ రాక

7

## శ్రీలంక పగ్గాలు మళ్లీ రణిల్ విక్రమ్ సింఘేకే?

సాగుతున్న అధ్యక్ష ఎన్నికల ఓట్ల లెక్కింపు



**కొలంబో,సెప్టెంబరు 21:** పొరుగుదేశం శ్రీలంక కొత్త అధ్యక్షుడు ఎవరనేది మరి కొన్ని గంటల్లో తేలిపోతున్నది. తదుపరి అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు శనివారం నిర్వహించిన పోలింగ్‌ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్‌ముగిసిన వెంటనే పోస్టల్‌ఓట్లలెక్కింపు తర్వాంతసాధారణ ఓట్లలెక్కింపు చేపట్టారు. ఆదివారానికి ఫలితం వెల్లడవుతుందని అంచనా. మొత్తం 22 ఎలక్టోరల్ జిల్లాల్లో ఉదయం ఏడు నుంచి నాలుగు గంటలవరకూ పోలింగ్ జరిగింది. అత్యంత ప్రశాంతవాతావరణంలో ఈ ఎన్నికలు జరిగాయని ఎన్నికల కమిషన్ ఛైర్మన్ ప్రకటించారు. పోలింగ్ వివరాలు అధికారికంగా వెల్లడి అవుతాయి. రెండేళ్లక్రితం తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎ దుర్కొన్న శ్రీలంకలో అధనయక్ష ఎన్నికల్లో ఈసారి త్రిముఖపోరు తప్పడంలేదు. ప్రస్తుత అద్యక్షుడు విక్రమసింఘేతోపాటునేషనల్‌పీపుల్స్ పవర్ ఎన్‌పిపికి చెందిన అనురకుమార దిస్సనాయకే, సమగి జన బలవేగయ ఎస్జేబీ పార్టీనుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సజిత్‌ప్రేమదాసలు పోటీలో ఉన్నారు. ప్రాధాన్యతా ఓట్లలెక్కింపు ఆధారంగా అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. పోటీలో ఉన్నవారిలో ఎవరికైతే 50శాతంకంటే ఎక్కువ ఓట్లు వస్తాయో వారే తదుపరి అధ్యక్షుడుగా ఎన్నికవుతారు. మొదటిప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఫలితం తేలకపోతే రెండోప్రాధాన్యతా ఓట్లు లెక్కింపుచేపడతారు. ఇప్పటివరకూ శ్రీలంకలోజరిగిన ఏ ఎన్నికల్లోనూ రెండో రౌండ్ వరకూ వెళ్లి దాఖలాలులేవు. మొదటి ప్రాధాన్య ఓట్లలెక్కింపుతోనే ఫలితం తేలిపోయింది. అయితే ఈసారి మాత్రం ముగ్గురితోనే పోటీ నడుస్తోంది.రాజపక్ష కుటుంబంనుంచి పోటీలో ఉన్న నమన్‌రాజపక్ష వైపు ప్రజలు ఆసక్తితోలేరు. ప్రజాభీష్టాన్ని చూస్తేమొత్తంగా ప్రస్తుత ప్రధాని సుదీర్ఘ రాజకీయ అనుభవశాలి, పాలనా పటిమ మెండుగా ఉన్న రణిల్ విక్రమ్‌సింఘేకే ప్రజలు పట్టం కడతారని అంచనా.

# 'జమిలి'లో ఆధిపత్య కుట్ర

## దేశాన్ని కబళించేందుకు బిజెపి యత్నం

### కాషాయ పార్టీని నిలువరించడంలో విశేష కృషి చేసిన ఏచూరి

### ఇటువంటి కీలక సమయంలో ఆయనలాంటి నేతలు అవసరం

### సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### ఏచూరికి ఘనంగా నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



శనివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఏచూరి సంస్మరణ సభలో చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో రాఘవులు, తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 21 ప్రభాతవార్త :** ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జమిలి ఎన్నికల ముసుగులో దేశంలో ఆధిపత్య చెలాయింలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని బిజెపి కబలించాలించాలని చూస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాల కలయికే భారత్ అని, యూనియన్ ఆఫ్ స్టేట్స్ భావనను దెబ్బ తీసేలా బిజెపి జమిలి ఎన్నికలను తీసుకొస్తుందని ధ్వజమెత్తారు. కాషాయ పార్టీని నిలువరించడానికి కాంగ్రెస్,కమ్యూనిస్టు లు కలిసి పనిచేసేలా ఏచూరి కీలక పాత్ర పోషించారని, ఇలాంటి కీలక సమయంలో సీతారం ఏచూరి లేకపోవడం దేశ రాజకీయాల్లో తీరని లోటన్నారు. శనివారం రవీంద్ర భారతిలో జరిగిన సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సహచర కాంగ్రెస్ పార్టీ విధానపరమైన ఆలోచనల్లో విభేదించినా పేదలకు, ప్రజాస్వామ్యవాదులకు ప్రభుత్వ విధివిధానాలు ఉపయోగపడాలని భారతదేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని రేకెత్తించి పేదలపక్షాల గళంవిప్పిన సీతారాం ఏచూరి మనమధ్యలో లేకపోవడం వామపక్ష పార్టీలతో పాటు దేశ రాజకీయాలకు పూడ్చలేని లోటని అన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసమే చివరిశ్వాస వరకు నిలబడిన ఏచూరి ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్య వేదికలపై దేశకీర్తి గొప్పదనాన్ని చాటిచెప్పారన్నారు. దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డికి సమకాలికుడుగా సీతారాం ఉండేవారని చెప్పారు. యూపిఏ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలక బిల్లులకు మద్దతిచ్చి క్రియాశీలపాత్ర పోషించారని, రాహుల్‌గాంధీ ఆయన్ను మార్గనిర్దేశకుడిగా గురువుగా భావిస్తారని తెలిపారు. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన, దేశంలో అధికారం కోసం జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించాలనుకుంటున్న కీలక సమయంలో మనకు దిక్సూచిలా ఉండాల్సిన సమయంలో మనమధ్య లేకపోవడం చాలా బాధాకరమని వాపోయారు. జమిలి ఎన్నికల వ్యతిరేక పోరాటంలో, భాష మత ప్రాంతాలమధ్య చిచ్చుపెట్టి అధికారాన్ని కాపాడుకోవాలనుకొంటున్న బిజెపి విధానాలను కామ్రేడ్ సీతారాంఏచూరి ఆలోచనలతో నిలువరిస్తూ ముందుకువెళదామని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో >>2



శనివారం డెలావేర్‌లోని ఫిలడెల్ఫియా అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి స్వాగతం పలుకుతున్న ప్రవాస భారతీయులు

# అమెరికాలో మోడీకి ఘనస్వాగతం

### నేడు క్వాడ్ సదస్సు, వివిధ కంపెనీల సిఇఒలతో భేటీ

### ఐరాస సదస్సులోనూ ప్రధాని ప్రసంగం

**ఫిలడెల్ఫియా, సెప్టెంబరు 21:** క్వాడ్‌సమావేశం, ఐక్యరాజ్యసమితి సదస్సులో కీలకప్రసంగం చేసేందుకుగాను మూడురోజుల పర్యటన కోసం అమెరికా చేరుకున్న ప్రధానిమోడీకి డెలావేర్‌లోని ఫిలడెల్ఫియా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. భారత సంతతికి చెందిన వేలాదిమంది మోడీకి స్వాగతం పలికేందుకు అక్కడకు వచ్చారు. డెలావేర్‌లోని హోటల్ డూపాంట్‌లో భారత సంతతికి చెందిన ప్రజానీకం ప్రముఖులతో ముచ్చటించారు. >>2

# రేవంత్ కుటుంబ అవినీతి రూ.8,800 కోట్లు!

### మాజీ మంత్రి కెటిఆర్ ఆరోపణ

### ముఖ్యమంత్రి బావమరిది కంపెనీకి దొడ్డిదారిన పనులు

### 'అమృత్' పథకం టెండర్లలో భారీ అవినీతి జరిగింది: మీడియాతో కెటిఆర్



శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాజీ మంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబర్21:** తెలంగాణలో రేవంత్‌రెడ్డి అవినీతి కుటుంబ కథా చిత్రం నడుస్తోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఘాటుగా విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మున్సిపాలిటీల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సిఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతి చేశారని ఆరోపించారు. అమృత్ టెండర్లలో సిఎం రేవంత్‌రెడ్డి రూ.8,888 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని సాక్ష్యాలను మీడియాకు చూపారు. శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే... ఫిబ్రవరి మొదటి వారంలో రూ.8,800 కోట్ల భారీ అవినీతికి సిఎం రేవంత్‌రెడ్డి తెరలేపారని కెటిఆర్ విమర్శించారు. సిఎం బాధ్యతలు నిర్వహిస్తున్న మున్సిపల్ శాఖ కేంద్రంగా రేవంత్‌రెడ్డి ఈ కుంభకోణాన్ని చేశారని అన్నారు. ఈ భారీ కుంభకోణంతో రేవంత్‌రెడ్డి పదవీ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్‌రెడ్డి కంపెనీకి అర్హతలు లేకపోయినా రూ.వేల కోట్ల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ఇండియన్ హ్యూమ్ వైప్ అనే కంపెనీని పిలిపించి బెదిరించి, ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని తెలిపారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్‌రెడ్డి బావ మరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని కెటిఆర్ అన్నారు. ఇందులో టెండర్ దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీతో రేవంత్‌రెడ్డి బావమరిది జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాలకు >>2

## నిరూపించకపోతే కెటిఆర్ రాజీనామా చేస్తారా?

2

ఆయనపై పరువు నష్టం దావా వేస్తా: మంత్రి పొంగులేటి



## ఢిల్లీ పీఠంపై అతిశీ

### కొత్త సిఎంగా ప్రమాణం

### రాష్ట్రానికి ఆమె మూడో మహిళా సిఎం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** ఆప్ మహిళా మంత్రి అతిశి మర్లేనా ఢిల్లీ కేంద్రపాలిత రాష్ట్రానికి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంచేసారు. శనివారం ఆమెచేత రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా ముఖ్యమంత్రిగా ప్రమాణంచేయించారు. అనంతరం మంత్రివర్గ సభ్యులుసైతం ప్రమాణాలు చేసారు. ఇప్పటివరకూ ఢిల్లీకి ముఖ్యమంత్రులుగా పనిచేసిన అందరికంటే పిన్నవయస్కురాలు అతిశి మర్లేనా. స్వతంత్ర భారతావనిలో బాధ్యతలు స్వీకరించిన 17వ మహిళా సిఎంగా కూడా నమోదయ్యారు. అయితే స్వల్పకాలానికి >>2

# భట్టి అమెరికా పయనం



### మైనింగ్, గ్రీన్ పవర్ రంగంలో పెట్టుబడులు లక్ష్యంగా రెండు దేశాల్లో పర్యటన

### అక్టోబర్ 4న తిరిగి రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబర్21:** అమెరికా,జపాన్ దేశాల్లో పర్యటనకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం బయలు దేరారు. ఈనెల 21 నుంచి అక్టోబర్ 4 వరకు పర్యటన చేయనున్నారు. మైనింగ్,గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎక్స్‌పోతో పాటు ప్రముఖ కంపెనీల ప్రధాన కార్యాలయాల సందర్శన,పెట్టుబడిదారులతో సమావేశం కానున్నారు. మైనింగ్,గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఆధునిక పద్దతులు,లోతైన అధ్యయనంతో పాటు పెట్టుబడులను ఆహ్వానించమే లక్ష్యంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క,అధికారుల బృందం శనివారం హైదరాబాద్ నుంచి అమెరికాకు బయలుదేరింది. ఈనెల 24,25 తేదీల్లో అమెరికా దేశంలోని లాస్ వేగాస్‌లో ఏర్పాటు చేస్తున్న అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోలో పాల్గొంటారు. అక్కడ వివిధ కంపెనీల సీఈఓలు,ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. తదుపరి హోవర్ డాంను సందర్శిస్తారు. 26న లాస్ ఏంజెల్స్‌కు చేరుకుంటారు. 27న ఎడ్వార్డ్స్ అండ్ సాన్‌బార్న్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ విధానాన్ని పరిశీలిస్తారు. 28న పెట్టుబడిదారులు,సాంకేతిక నిపుణులతో సమావేశం అవుతారు.29న జపాన్ దేశంలోని టోక్యోకి చేరుకుంటారు. 30న స్థానిక దౌత్యవేత్త ఏర్పాటు చేసిన డిన్నర్‌లో పాల్గొంటారు. పెట్టుబడిదారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తారు. అక్టోబర్ 1న పెట్టుబడిదారులతో వ్యక్తిగతంగా (వన్ టు వన్) సమావేశం అవుతారు. యమాన్షీ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటును సందర్శిస్తారు. అక్టోబర్ 2న తోషిబా,కవాసకిల ప్రధాన కార్యాలయాల సందర్శన తదుపరి ఓఎస్ఏకెపె చేరుకుంటారు. అక్టోబర్ 3న పానసోనిక్ ప్రధాన కార్యాలయం సందర్శన, అక్టోబర్ 4న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం. అమెరికా పర్యటనకు డిప్యూటీ సిఎంతో పాటు ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, ఇందన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి బలరాం నాయక్, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులు వెళ్లారు.

# పార్టీలకు అతీతంగా పనిచేస్తా: అరికెపూడి

### అసెంబ్లీలో జరిగిన తొలి పిఎసి సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్,సెప్టెంబర్21:** ఇటీవల అసెంబ్లీ సెక్రటరీ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని పిఏసీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా ఈ రోజు తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యే గాంధీ అధ్యక్షతన పిఏసీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు,పిఏసీ సభ్యులు కాంగ్రెస్ నుంచి టి. జీవన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. అలాగే బిఆర్ఎస్ నుంచి వేముల ప్రశాంత్‌రెడ్డి,గంగుల కమలాకర్,భానుప్రసాద్ రావు,సత్యవతి రాథోడ్,ఎల్.రమణ హాజరవ్వగా ఎంఐఎం నుంచి అహ్మద్‌బీన్ అబ్దుల్ బలాల,బిజెపి నుంచి రామారావు పవార్,సిపిఐ నుంచి కూనంనేని సాంబశివ రావు హాజరయ్యారు. అకౌంటెంట్ జనరల్ పి.మాధవి,అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్. వేదాంతం నర్సింహాచార్యులు హాజరయ్యారు. ముందుగా పిఏసీ ఛైర్మన్‌కు, సభ్యులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ ఛైర్మన్,అసెంబ్లీ వ్యవహారాల మంత్రి,అసెంబ్లీ సెక్రటరీ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశం ప్రారంభమైన సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిఏసి సమావేశం నుంచి >>2

## 'కల్తీ' పాపంలో భజన పరులుగా మారిన 'విజిలెన్స్'!



# కదులుతున్న డొంక!

### నెయ్యి టాంకర్లను అనుమతించిందెవరు?

### లడ్డు పోటులో కార్మికులు మౌనమెందుకో!

### ల్యాబ్ సిబ్బంది ఏం చేస్తున్నారు?

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఏడుకొండలవేంకటేశ్వరస్వామి క్షణకాల దర్శనం తరువాత అంతటి పవిత్రంగా,భక్తితో స్వీకరించే లడ్డూప్రసాదాల తయారీలో కీలకమైననెయ్యిలో జంతువుల కొవ్వు నూనెలతోబాటు ఇతరత్రా నూనెలు కలిపారనే వివాదం దేశవ్యాప్తంగా దుమారం కొనసాగుతోంది. గత మూడురోజులుగా కల్తీ నెయ్యిరగడ సామాన్యభక్తుల నుండి ముఖ్యమంత్రులు, రాష్ట్రమంత్రులు, కేంద్రమంత్రులు,సినీప్రముఖులు,ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నాయి. పలు రకాలు నూనెలు కలిసిన కల్తీనెయ్యి తిరుమలకు సరఫరా చేశారని ఇప్పుడు సంచలన వ్యాఖ్యలు చేసిన టిటిడి అధికారులు, స్పందించిన ప్రభుత్వం తదుపరి చర్యలకుఉపక్రమించింది. ఈ వ్యవహారంపై రాజకీయంగాగాక దేవునికి అపచారం చేశారనే కోణంలో డొంక కదిలిస్తున్నారు. ఈ ఘటనలో ఎవరిపై వేటు పడనుందనేది సర్వత్రా ఆసక్తికర పరిణామంగా మారింది. కల్తీనెయ్యి వస్తున్నా >>2

## శ్రీవారి ఆలయంలో మహాశాంతి యాగం

సంప్రోక్షణతో మూడు రోజులు నిర్వహణకు టిటిడి నిర్ణయం

5

# ప్రజల బతుకుపై ధరల దరువు

గత కొంత కాలంగా పెరిగిన ధరలు, ఇతర వ్యయాలతో కుటుంబ బడ్జెట్ తలకిందులుగా మారుతోంది. ఇంటి కిరాయి నుండి ప్రతీ ఇంటిలో అనారోగ్యం ఖర్చులు, ఇతర నిర్వహణ ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకే తాము అధికారంలోకి వస్తే ఉచితంగా కరెంటుఇస్తామని, పెన్షన్లు పెంచుతామని, మహిళలు, రైతులకు అది చేస్తామని, ఇది చేస్తామని ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రజలకు ఎన్నో హామీలు, మరెన్నో తాయిలాలు ప్రకటిస్తున్నాయి. అయితే ప్రజలపై పడే భారాలను తగ్గిస్తామని, ధరలు, ఛార్జీలు, పన్నులు పెంచబోమని, వేయబోమని ఏ పార్టీ కూడా మాట్లాడకపోవడం విశేషం. కేవలం జనాకర్షణ పథకాలు, సంక్షేమ, అభివృద్ధి పథకాల ధ్యాసే తప్ప ప్రజలు ముఖ్యంగా సామాన్యునిపై పడుతున్న భారాలను తగ్గించే విషయమై ఎక్కడా మాట్లాడకపోవడం శోచనీయం. ధరల పెరుగుదల ప్రస్తుతం పేద, మధ్యతరగతి వర్గాల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. సామాన్యునికి నిత్యంఅవసరమయ్యే బియ్యం, పప్పులు మొదలు, కూరగాయలు, గ్యాస్, కరెంటు బిల్లులు, మున్సిపల్, పంచాయితీ పన్నులు, బస్ ఛార్జీలు, వాహనాల పన్నులు వంటి వాటి వరకూ ప్రతీ దానిపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుకుంటూపోతున్నాయి. కరెంటు బిల్లులు మోతమోగిస్తున్నాయి. చిన్న పాటిగుడిసెకు సైతం రూ.300బిల్లువస్తోంది. అలాగే పాలధరలు పెరిగాయి. పప్పులరేట్లు అందకుండా పోయాయి. భారీగా పెరిగిన ఛార్జీలతో ప్రయాణీకులకు పెద్దభారంగా పరిణమించింది. పెట్రోలు, డీజిల్ ధరలుచుక్కలు చూపిస్తున్నాయి. కష్టాలు, బాధలను మరచిపోయేందుకు సినిమా థియేటర్‌కు వెళదామనుకుంటే అక్కడ కూడా భారీగాపెంచిన టికెట్, స్నాక్స్, పార్కింగ్ ధరలు సగటు మనిషిని భయపెడుతున్నాయి. ఆస్తిపన్ను దగ్గర నుండి రవాణా వాహనాల పన్ను, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల చార్జీలు ఇలా ఏదిటచ్ చేసినా సామాన్యుడు విలవిల్లాడాల్సిన పరిస్థితి.

సామాన్యుల రోజువారీ జీవనానికి కావాల్సిన నిత్యావసర వస్తువుల నుండి వైద్యం వరకూ దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. తాజాగా విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచిక ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో సగటు వ్యక్తి జీవనం రోజురోజుకూ మరింత భారంగా మారుతోంది. దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో పోలిస్తే ఈ రెండు రాష్ట్రాల్లో నిత్యావసర సరుకులు, వైద్య ఖర్చులు తదితర ధరలు బాగా పెరిగాయి. వాస్తవానికి ధరల జాతీయ సగటు దాదాపు 100 శాతం పెరిగినట్లు కనిపిస్తున్నా ప్రాంతాల వారీగా విడివిడిగా చూస్తే కొన్ని చోట్ల దాదాపు 200 శాతం పెరిగినవి కూడా ఉన్నాయి. ఆహార ధరల సూచిక జాతీయ సగటు ఏడాది వ్యవధిలో 192.5 నుండి 203.4కు పెరిగింది. దేశంలోని అన్ని నిత్యావసరాలను పరిశీలిస్తే కూరగాయల ధరల సూచిక జాతీయ సగటు అత్యధికంగా 260.6కి చేరింది. గత ఏడాదితో పోలిస్తే కూరగాయల ధరల ద్రవ్యోల్బణం 10.71శాతం, పప్పులు, వాటి ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 13.60 శాతం పెరగడం గమనార్హం. అన్ని రకాల నిత్యావసరాల ద్రవ్యోల్బణం 3.65 శాతం ఉందంటే ఇవి ఏ స్థాయిలో పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల పెరిగిన ధరలతో సామాన్యుల నోట మాట రావడం లేదు. ఏ వస్తువు కొందామన్నా ధరల పెరుగుదల కనిపిస్తోంది. పేద, మధ్య తరగతి వర్గాలను ఎవర్ని కదిలించినా పది మాటల్లో కనీసం రెండు మూడైనా పెరిగిన ధరల గురించే ఉంటున్నాయి. పెట్రోల్, వంట నూనెలు, ఇంటి పన్నులు, నీటి పన్నులు, కరెంట్ బిల్, పాలు, కూరగాయలు, పప్పులు, గ్యాస్, ఆర్టీసీ ఛార్జీలు, ఎరువులు, ఇలా వస్తువు ఏదైనా పెరుగుదల అనే పాయింట్ మాత్రం కామన్‌అయింది. కూరగాయల ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దీంతో సామాన్యుడు కూరగాయలు తినే పరిస్థితి లేకుండా పోయింది. తుఫాను ప్రభావంతో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కురిసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతిని కూరగాయల ధరలపై తీవ్ర ప్రభావం పడింది. రూ.10 ఉన్న బెండకాయ ధర కిలో కు ఇప్పుడు రూ.80కు చేరింది. మిగిలిన కూరగాయల

**సిహెచ్ వి వి రఘుబాబు**

పరిస్థితికూడా భారీగా పెరుగుదల చోటు చేసుకుంది. పది రోజుల క్రితం బెండకాయలు కిలోకు రూ.10 రూపాయలు ఉండేవి. అయితే దీనికే ఏకంగా రూ.70కు పెరగడంతో వినియోగదారుల కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. రూ.20 ఉండే వంకాయలు ఇప్పుడు రూ.40 పెరిగి కిలోకు రూ.60కు చేరింది. అలాగే దొండకాయలు కిలోకు రూ.60, పచ్చిమిర్చి రూ.80, కొత్తమీర రూ.400 పలుకుతోంది. అలాగే ఉల్లిపాయలు రూ.70, షాపింగ్ మాల్స్‌లో రూ.85, టమాటాలు



రూ.30, బీట్‌రూట్ రూ.50, ఆలు రూ.50, క్యాప్సికం రూ.70, కాకరకాయలు రూ.50, బీన్స్ రూ.60, క్యాబేజీ రూ.45, క్యారెట్ రూ.70, బీరకాయలు రూ.55కు ధర పెరిగింది. కాగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కూరగాయల తోటలు దెబ్బతిని, మార్కెట్లకు దిగుమతులు తగ్గడంతో వాటి రేట్లు పెరిగాయి. అలాగే వెల్లుల్లి ధర గత నెలలో 200 రూపాయలు ఉండగా ప్రస్తుతం కిలో 350 రూపాయలకు చేరుకుంది. ఇక పండుగల వేళ కేంద్రం సామాన్యులకు భారీ షాక్ఇచ్చింది. వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకూ పెంచేసింది. దీంతో సన్‌ఫ్లవర్, సోయాబీన్, రిఫైన్డ్ పామాయిపై ఇంపోర్ట్ టాక్స్ 12.5 శాతం నుండి 32.5 శాతానికి చేరింది. ఇంపోర్ట్ టాక్స్ పెంపుతో వంటనూనెల ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. మొత్తంగా ముడినూనెలపై సుంకం 5.5శాతం నుండి 27.5 శాతానికి, రిఫైన్డ్ నూనెలపై సుంకం 13.75 శాతం నుండి 35.75 శాతానికి పెరిగింది. ఈ విధంగా కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం పెంచడంతో అన్ని రకాల వంట నూనెల ధరలు లీటరుపై ఒక్కసారిగా రూ.15 నుండి రూ.25 వరకూ పెరిగాయి. హైదరాబాద్‌లో పామాయిల్ ధరకిలో రూ.100 ఉండగా, రూ.115 నుండి రూ.120 వరకూ విక్రయి స్తున్నారు. అలాగే సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 ఉండగా, ఇప్పుడది రూ.130 నుండి రూ.145 వరకూ, రూ.155 రూపాయలుండే వేరుశెనగ నూనె రూ.170 నుండి రూ.210 వరకూ అమ్ముతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు బ్లాక్ చేస్తున్నారు. స్టాక్ లేదంటూ బోర్డులు పెట్టి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. మరికొందరు పాతస్టాక్‌ను కూడా పెరిగిన ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మరోపక్క ఈ ఏడాది జూలై లో రూ.51.01గా ఉన్న గ్రేడ్-1 కిలో బియ్యం ధర ఈనెల మొదటి వారానికి రూ. 63.64కు, రెండవ వారానికి రూ. 63.84కు చేరాయి. గత ఏడాది రూ.152గా ఉన్న కిలో కందిపప్పు ఇప్పటికి రూ. 173.81కు, గత ఏడాది జూలైలో రూ.117.17 ఉన్న మిన పప్పు ఇప్పుడు రూ.136.35కు, శెనగపప్పు రూ.73.21 ఉండగా, అది రూ.104.86కు పెరి గింది. కాగా పెట్రోలు అసలు ధర 57 రూపాయలు మాత్ర మే. కానీ కేంద్ర పన్నులు, రాష్ట్ర పన్నులు, డీలర్ కమిషన్ ఇలా ప్రజల వద్దకు చేరేటప్పటికి తడిసి మోపెడు అవుతోంది. క్రూడాయిల్ నుండి తీసిన పెట్రోల్, డీజిల్, ఇతర ఇంధనా లపై కేంద్రం పన్నులు విధిస్తుంది. ఈ విధంగా పెట్రోల్‌పై రూ.19.90, డీజీల్‌పై రూ.15.80 చొప్పున పన్నులు విధి స్తోంది. ఇక పెట్రోలు, డీజీల్ ధరలపై రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పన్నులు విధిస్తున్నాయి. ఒక్కో రాష్ట్రంలో ఒకోనపన్ను విధానం ఉంది. దీని ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పన్నును వసూలు చేసి ఆదాయం పొందుతున్నాయి. తెలంగాణలో చూసు కుంటే లీటరు పెట్రోలు ధర రూ.109.66 నుండి రూ.110.88గా ఉంది. ఇందులో అసలు పెట్రోల్ ధర రూ.57.35 ఉంటే సెంట్రల్ టాక్స్, ఎక్సైజ్ డ్యూటీ కింద కేంద్రం రూ.19.90 భారం వేస్తుండగా, ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం దానికి అదనంగా వ్యాట్ కింద రూ.28.44, ఇక డీలర్ కమిషన్ మరో రూ.3.97 వడ్డిస్తున్నాయి. ఇదే సమయంలో తెలంగాణలో విద్యుత్ పంపిణీ సంస్థలు వినియోగదారులపై రూ.1,200 కోట్ల మేర బాదుడుకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు సిద్ధమయ్యాయి. హైటెన్షన్ (హెటీ) కేటగిరీ వినియోగదారులపై భారీగా వడ్డించడంతో పాటు, గృహో పయోగానికి వినియోగించే లోటెన్షన్ (ఎల్‌టి) విద్యుత్‌కు 300 యూనిట్లు దాటితే అటువంటి వారికి షాక్ ఇవ్వనున్నాయి. విద్యుత్ చార్జీలతో పాటు, ఫిక్స్‌డ్ చార్జీలను కూడా పెంచబోతున్నాయి. తద్వారా రూ.1,200 కోట్ల మేర అదనపు ఆదాయాన్ని సంపాదించాలని దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలం గాణ విద్యుత్ పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. హెచ్‌టీ కేటగిరీ విద్యుత్ చార్జీల పెంపుద్వారా 700 కోట్లరూపాయల, ఫిక్స్‌డ్ చార్జీల రూపంలో 100 కోట్ల రూపాయలను కలిపి మొత్తం హైటెన్షన్ విద్యుత్ వినియోగదారులపై 800 కోట్ల రూపాయల భారం పడనుంది. అలాగే 300 యూనిట్లు దాటిన గృహ విద్యుత్ వినియోగదారుల నుండి పిక్స్‌డ్ చార్జీలను వసూలు చేయడం ద్వారా మరో 400 కోట్ల రూపాయల మేర భారాన్ని మోపుతున్నాయి. ఈ విధంగా అన్నింటా పెరిగిన ధరలతో సామాన్యుల కుటుంబ బడ్జెట్ భరించ లేని భారంతో తలకిందులుగా మారుతోంది.

# తేలని 'చికిత్స'!

పశ్చిమ బెంగాల్

పట్టువిడుపులు లేని పంతాలకు పోతే, అది పశ్చిమబెంగాల్ వైద్యసంక్షోభంలా మారుతుందని చెప్పవచ్చు. వేడుక చూసేవారికి అది వినోదంగానే కనిపించవచ్చు కానీ వేదనతో విలవిల్లాడేవారి పరిస్థితి ఏమిటి? 40 రోజులు దాటి పోయాయి. బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు స్టెతస్కోపులు మడతపెట్టి దీక్షలు కొనసాగిస్తున్నారు. అటు మమత ప్రభుత్వం, ఇటు జూ.డాక్టర్లురెండు వర్గాలకు ఎవరి పట్టువారిదే. ఎవరూ సడలించుకోవడంలేదు. ఫలితం కొన్ని వేలమంది రోగులు నానాయాతనలు పడుతున్నారు. జూడాల సమస్యలను ఎవరూ కాదనరు. అందరి లాగే వారూ అనేకానేక సమస్యలతో సతమతమ వుతున్నారు. అయినా ఏదో విధంగా రోగులకు సేవలందిస్తున్నారు. వారిని ఎంతైనా ప్రశంసించవలసిందే. కానీ నెల రోజులుపైగా బెంగాల్‌లో కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తే ఎవరికైనా జాలి కలుగుతుందా! ఆర్‌జికర్ వైద్యకళాశాల అనుబంధ ఆసుపత్రిలో తమ సహచర వైద్యురాలు అతి కిరాతకంగా అత్యాచారం, హత్యకు గురైన కారణంగా వారిలో పెల్లుబికిన ఆందోళన, ఆగ్రహం పట్ల దేశ వ్యాప్తంగా అంతా సానుభూతినే ప్రదర్శించారు. 'మెడికల్ మాఫియా' గుప్పెట్లో నలిగిపోతున్న వైద్య సిబ్బందిని బంధ విముక్తుల్ని చేయాలని వారు కంకణం కట్టుకున్న తీరుకు సమాజంలో అందరి నుండి ఎంతగానో మద్దతు లభించింది. అయితేవారు చేస్తున్న సమ్మెవల్ల రోగులు కొన్ని డజన్ల మంది పిట్టల్లా రాలిపోతుంటే దానిని ఎవరు సమర్థించగలరు? ఈ విషయం ప్రభుత్వానికి తెలుసు. అందుకే ఇంతగా సాగదీసిందేమో అనిపిస్తుంది. మరో కోణంనుంచి ఆలోచిస్తే, ఈ మొత్తం వ్యవహారంలో మమత ప్రభుత్వం చాలా ఉదాశీనంగా వ్యవహరించినట్లే కనిపిస్తుంది. ఇది ప్రజలతో ముడిపడి ఉన్న సమస్య కావడం వల్లవారినుంచి వ్యతిరేకత వస్తే డాక్టర్లు తోక ముడిచి విధులకు హాజరవుతారని భావించిఉండవచ్చు. అందుకేనేమో! చర్చలు ఏదోవిధంగా వాయిదా పడేట్లుగానే ప్రభుత్వం వ్యవహరించినట్లు కనిపిస్తుంది. నాలుగు పర్యాయాలు డాక్టర్లను చర్చలకు పిలిచారు కానీ అజెండా విషయంలో స్పష్టత రాకపోవడంతో మళ్లీ మొదటికి వచ్చింది. ఖాళీ కుర్చీల ముందు ముఖ్యమంత్రి

**ఎ.వి.వి ప్రసాద్**

మమత కూర్చున్నట్లుగా మీడియాలో వచ్చిన ఓ ఫొటోచూస్తే తప్పు తప్పక డాక్టర్లదే అనిపిస్తుంది. కానీ ముఖ్యమంత్రి రావడానికి పది నిముషాల ముందు కూడా అజెండా ఖరారు కాలేదనీ, డాక్టర్లు చర్చలకు రావడానికి సిద్ధంగానే ఉన్నా వారిని సరైన విధంగా అధికా రులు సమావేశం బల్ల వద్దకు తేలేకపోయారనీ తర్వాత తెలిసింది. ప్రభుత్వం ఇలాంటి వైఖరి అవలంభిస్తే సమస్య ఎలా పరిష్కారమవుతుంది! వైద్యురాలి హత్యాచారం నేపథ్యంలో డాక్టర్లకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలనే డిమాండ్‌తో జూడాల ఆందోళనతొలుత మొదలైంది. తరువాత వారి డిమాండ్ల సంఖ్య రోజుకొకటిగా పెరుగుతూవచ్చింది. పనిగంటల భారం తగ్గించాలనీ, వైద్య విద్య డైరెక్టర్, ఆరోగ్యశాఖ కార్యదర్శి, నగర పోలీసు కమిషనర్ రాజీనామా చేయాలనీ, వైద్యరంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలనీఇంకా మరికొన్ని డిమాండ్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. సిఎం తమతోజరిపే చర్చలను ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లన్నీ వారే చేశారో, వారిచేత ఎవరైనా చేయించారో తెలియదుకాని అసలు సమస్య పక్కకుపోయి, అనవసర రాద్ధాంతం పెరిగిపోవడంతో ఇలా అయితే మేం 'ఎలా పరిష్కరిస్తాం' అంటూ ప్రభుత్వం కూడా మొండికేసింది. హత్యాచారం కేసుపై విచారణ సుప్రీం కోర్టులో సాగుతోంది. ఈ కేసుకు సంబంధించి సిబిఐ గత వారం కొత్త ఛార్జిషీటును కూడా దాఖలుచేసింది. ఈ నివేదిక ప్రకారం మరో కొత్త విషయంకూడా తెరపైకి వచ్చింది. కేసును సుమోటోగా విచారణకు తీసుకున్న సుప్రీంకోర్టు సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. అది కొంతవరకు కొనసాగింది కూడా. బాధితురాలికి పూర్తి న్యాయం జరగడానికి ఏచర్యలు తీసుకోవాలో వాటిపై చర్చలు జరగాలని కోరకుండా, అటువంటి చర్యలు పునరావృతం కాకుండా వైద్య సంస్థలలో ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది చర్చించకుండా ఇతరేతర అంశాలన్నీ తెరపైకి తెచ్చేసరికి 'మీరు అజెండా మార్చేస్తున్నారు, వాటికి ఇది సమయం కాదు' అంటూ ప్రభుత్వం రెండుసార్లు ముఖంచాటేసింది. ముఖ్యమంత్రి రాకుండానే ఒకసారి సమావేశం వాయిదాపడింది. సమస్య రానురాను ఇలా జటిలం కావడంతో ప్రభుత్వం సాగతీతకు మంచి కారణం దొరికినట్లయింది. ఈదశలో గత గురువారం (19, సెప్టెంబరు)రాత్రి హఠాత్తుగాడాక్టర్లు ఓప్రకటన చేస్తూ రాష్ట్రంలో భారీ వరదల రీత్యా సమ్మెను పాక్షికంగా విరమిస్తున్నట్లు చెప్పడంతో వారు కొంత మేరకు విధులకు హాజరైనా చర్చల్లో ప్రతిష్టంభన మాత్రం అలాగే ఉంది. డాక్టర్లు కోరినట్లుగా ఎట్టకేలకు కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్‌పై వేటుపడింది. అలాగే ఆరోగ్య సేవల డైరెక్టర్ దేవాశిష్ హాల్దార్, వైద్య విద్య డైరెక్టర్ కాస్తవ్‌నాయక్‌ను కూడా తొలగించింది. అయితే ఇవి కంటితుడుపు చర్యలు మాత్రమే అనుకోవాలి. వ్యవస్థలను ప్రక్షాళన చేయకుండా వ్యక్తులను మార్చినంత మాత్రాన ఫలితం ఏం ఉంటుంది! మహిళా డాక్టర్ల సేవలకు సంబంధించి, వారికి అందచేసే భద్రతగురించి అందరికి తెలిసేలా ప్రభుత్వం ఒకస్పష్టమైన విధానం రూపొందించాలి. డాక్టర్లు దాని కోసం డిమాండ్ చేస్తే ఫలితం ఉంటుందిగాని ఎవరో ఓ అధికారిని తొలగించి నంత మాత్రాన ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఆర్జికల్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్‌ఘోష్ ప్రధాన నిందితుడుసంజయ్ రాయ్ శిక్షనుంచి తప్పించుకోకుండా డాక్టర్లు చర్యలు తీసుకోగలిగితే బాధితురాలి కుటుంబానికి ఊరట కలుగుతుంది. సుప్రీంకోర్టు ఆదేశించినట్లు నైట్ షిఫ్టులు చేసే డాక్టర్లను ప్రత్యేక భద్రతను అన్ని ఆసుపత్రులు కల్పించగలగాలి. అందుకు ప్రభుత్వం పూనుకోవాలి. ఆ హామీ ప్రభుత్వం ఇస్తే అంతకంటె కావల్సిందేముంటుంది! డాక్టర్ల ఆందోళనలకు పరిష్కారం దొరుకుతుంది.



డాక్టర్ల ఆందోళన

# లంకాధిపతికి గట్టిపోటీ!

శ్రీలంక

ఆర్థిక సంక్షోభంతో అతలాకుతలమై చివరకు ప్రభుత్వం కుప్పకూలే స్థితికి చేరుకున్న శ్రీలంకలో ఇప్పుడు అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక సంక్షోభం, నిధులే లేని స్థితినుంచి కోలుకుంటున్న దశలో ఉన్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికలపై ప్రపంచదేశాలన్నీ ఆసక్తి చూపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం ఏర్పడిన ఆర్థిక సంక్షోభంతో దేశప్రజలు వీధుల్లోకి వచ్చి చివరకు ఆ దేశ చిరకాల అధ్యక్షుడిని కూడా తరిమికొట్టిన సంగతి తెలిసిందే. పదవీచ్యుతిపొంది దేశం వీడివెళ్లిన రాజపక్ష కుటుంబం తర్వాత రణిల్‌విక్రమ్ సింఘే పాలనా పగ్గాలు చేపట్టి దేశాన్ని గాడినపెట్టే కసరత్తులు చేసారు. మళ్లీ ఆయనే అధ్యక్ష ఎన్నికలబరిలో నిలిచారు. అలాంటి సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడు అవసరమని ఆర్థికవేత్తలు భావిస్తున్నా దేశ ఓటర్లు ఎటువైపు ఉన్నారనేది అంతుబట్టకుండా ఉంది. మూతపడిన పరిశ్రమలు తెరిపించడంలో కానీ, ఆర్థికవ్యవస్థలోకి నగదు చెలామణిని తీసుకురావడంలోకానీ దౌత్యసంబంధాలను మెరుగుపరుచుకోవడంలోకాని విక్రమ్‌సింఘే అనితర సాధ్యమైన కృషిచేసిన సంగతి తెలిసిందే. నిత్యావసరాల ధరలు, పెట్రో డీజిల్‌ధరలు చుక్కలనంటిన తరుణంలో కొన్ని నెలలపాటు శ్రీలంకలో దారుణపరిస్థితులు నెలకొన్నాయి. అందువల్లనే రాజపక్ష కుటుంబాన్ని మొత్తం దేశం నుంచే తరిమేశారు శ్రీలంక ప్రజలు. ఇప్పుడు జరిగే అధ్యక్ష ఎన్నికలు అభివృద్ధి కాముకుడికే పట్టం కట్టేవిధంగా ఉన్నా పోటీలో వీరుకాకుండా ఐదుగురు నాయకులు రంగంలో నిలిచారు. వామపక్ష రాజకీయవేత్తగా నిలిచిన అనుర కుమార దిస్సనాయకే ముందంజలో ఉన్నారు. అవినీతి వ్యతిరేక నినాదంతో ఆయన ఎన్నికల వాతావరణంలో దూసుకుపోతున్నట్లు సర్వేలు చెపుతున్నాయి. మూడు డజన్లకుపైగా అభ్యర్థులు బరిలో నిలిచినా కేవలం ఐదుగురిపేర్లను మాత్రమే ఇప్పుడు మనం పరిగణనలోనికి తీసుకోవాలి. శనివారమే పోలింగ్ జరిగిన ఈ ద్వీపకల్పదేశంలో తదుపరి అధ్యక్షుడు ఎవరన్నది తేలిపోతుంది. ప్రస్తుతం దేశపరిస్థితులను గమనంలోకి తీసుకుంటే విదేశీ కరెన్సీ నిల్వలు అడుగంటిపోయాయి. రుణాలు 83 బిలియన్ డాలర్లకు పెరిగిపోయాయి. ద్రవ్యోల్బణం 70శాతానికి నమోదైంది. ఆనాడు

**గన్ని మోహన్**

ఎదురైన పరిస్థితుల్లో రాజపక్ష కుటుంబం దేశం వీడి 50 రోజులపాటు విదేశంలో తలదాచుకుంది. తదనంతరం విక్రమ్‌సింఘే హయాంలో ద్రవ్యో ల్బణాన్ని కిందికి దించడంతోపాటు శ్రీలంక రూపాయి విలువలను పటిష్టం చేయడంతో ఆర్థిక వ్యవస్థకుకొన్ని పరిష్కారాలు లభించాయి. అయితే ఉపాధికల్పన పరంగా యువత గుర్రుగా ఉంది. ఈ అంశాలే ఎన్నికలను ప్రభావితం చేస్తాయనడంలో సందేహంలేదు. ఇప్పుడు పోటీ ప్రధానంగా అనుర దిస్సనాయకతో పాటు విక్రమ్‌సింఘే మధ్యనే ఉంటుంది. వీరిద్దరితో పాటు రాజపక్ష కుటుంబం నుంచి మహీంద రాజపక్ష తనయుడు నమల్ రాజపక్ష, దివంగత మాజీనేత ప్రేమదాస కుమారుడు సాజిత్ ప్రేమదాసలు కూడారంగంలో నిలిచారు. 1.7కోట్లమంది ఉన్న ఓటర్లు ఇప్పుడు ఎవరిని ఎన్నుకుంటారన్నదే ఉత్కంఠగానిలిచింది. గత ప్రభుత్వంతో పూర్తి గుణపాఠం తెచ్చుకున్న శ్రీలంక వాసులు ఈసారి ఎన్నికల్లో ఆచితూచి వ్యవహరిస్తారు. మొత్తం 38మంది అభ్యర్థులున్నా బరిలో ఈ నలుగురి మధ్యనే పోటీ నెలకొంది. 1982 ఎన్నికల తర్వాత అధ్యక్ష ఎన్నికల్లో తొలిసారి త్రిముఖ పోటీ నెలకొంది. పదవీచ్యుతి పొందిన రాజపక్ష వారసుడు నమల్ రాజపక్షకు ఈ ఎన్నికల్లో మద్దతు లభిస్తుందని ఊహించలేం. మిగిలిన ముగ్గురిలో కూడా శ్రీలంకవాసులు అనుర దిస్సనాయకేకు మొగ్గుచూపించేందుకు కారణం కూడా లేకపోలేదు. అవినీతి వ్యతిరేక నినాదంతో ఆయన ఎన్నికల ప్రచారంలోకి రావడమే అందరినీ ఆకర్షించింది. ఇక అనుభవం రీత్యా, పాలనాపరంగాను, వయోరీత్యా కూడా పలుపర్యాయాలు ప్రధానిగా కూడా పనిచేసిన రణిల్ విక్రమ్‌సింఘేకు ఎక్కువ ఓట్లు పడతాయని అంచనా. పూర్తిగా పతనం అయిన దశలో ఉన్న శ్రీలంకకు దిశానిర్దేశం చేయడం, ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల నుంచి బెయిలౌట్ ప్యాకేజిలు రప్పించుకోవడంలో విక్రమ్‌సింఘే చేసిన కృషి ఎవ్వరూ మరువలేనిది. దీనికితోడు పొరుగుననే ఉన్న భారత్‌లో ఆయన నెలకొల్పిన సత్సంబంధాలు కూడాకొంత ఆ దేశాన్ని మాంద్యం నుంచి బయటపడేసాయి. తానుచేపట్టిన కార్యాచరణ వల్లనే దేశం ఇప్పుడు కోలుకుందని ఆయన ఎన్నికల ప్రచారంలోకూడా చెప్పుకుంటూ వచ్చారు. ఇక ప్రైవేటు సర్వేల పరంగా చూస్తే అధ్యక్ష పోటీలో అనురకుమార దిస్సనాయకే ముందంజలో ఉన్నట్లుతెలుస్తోంది. యువత నుంచి ఆయనకు భారీమద్దతు లభిస్తోంది. గత పార్లమెంటు ఎన్నికల్లో ఆయనకు3శాతం ఓట్లు మాత్రమే రాగా విక్రమసింఘేకు రెండు శాతం, అత్యధికంగా ప్రేమదాసకు 25శాతం ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో కూడా తాను 20 లక్షల మెజార్టీతో విజయం సాధిస్తామని ప్రేమదాస వారసుడు చెపుతున్నారు. అయితే సర్వేల్లో మాత్రం ఆస్థాయి కనిపించడంలేదు. గత ఎన్నికల్లో ఈ ముగ్గురు నేతలకు భారీ షాక్‌లు తగిలాయి. ఇప్పుడు జరిగే ఎన్నికలు గత ఎన్నికల కంటే భిన్నమైనవి. ఈసారి 1.7 కోట్లమందికిపైగా ఓటర్లున్నారు. 13,421 కేంద్రాల్లో జరిగే పోలింగ్ మరుసటిరోజే అధ్యక్ష అభ్యర్థిని నిర్ణయించనున్నది. ప్రాధాన్యతా క్రమంలో ముగ్గురు అభ్యర్థులకు ఓట్లువేస్తారు. మొదటి ప్రాధాన్యతా ఓట్లు అత్యధికంగా పొందిన నాయకుడికే శ్రీలంక ప్రజలు అధ్యక్షునిగా పట్టం కట్టినట్లు ఆ దేశ ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రణిల్ విక్రమ్‌సింఘేలాంటి అనుభవశాలి దేశానికి అవసరమని మెజార్టీ ప్రజలు భావిస్తున్నా, అవినీతి వ్యతిరేక నినాదంతో వస్తున్న అనురకుమార దిస్సనాయకేకు యువతలో మంచి పట్టు ఉన్నట్లు కనిపించడంతో ఇద్దరిలో ఎవరికి శ్రీలంక ప్రజలు మొగ్గుచూపుతారన్నది మరో 24 గంటల్లో తేలిపోతుంది.



రణిల్ విక్రమ్‌సింఘే

# బిజెపి పాలనలో తగ్గిన ఉపాధి, పెరిగిన నిరుద్యోగం!

భారతదేశంలో అన్ని రంగాల్లో అభివృద్ధి శరవేగంగా పరుగులు పెడుతూ ఉందని, ప్రపంచంలో అతిపెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ ఏర్పడనుందని, ఉపాధి పెరిగి నిరుద్యోగం, పేదరికం తగ్గిందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం ఎంత బూటకమో దేశంలో పెరిగిన నిరుద్యోగం, తగ్గిన ఉపాధిని గమనిస్తే తెలుస్తుంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) భారతదేశ ఉపాధి నివేదికను 2024ను విడుదల చేసింది. 2000 సంవత్సరం నుంచి 2024 వరకు నిర్వహించిన సర్వేల ద్వారా, భారత ప్రభుత్వ రిజర్వు బ్యాంకు లెక్కలను, జాతీయ నమూనా సర్వేను, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ సర్వేలను ఉపయోగించి ఈ నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2022 సంవత్సరం ఉత్పత్తిలో శ్రామికుల వినియోగం 59.8 శాతంగా ఉంటే భారతదేశం 55.2 శాతంగా ఉంది. భారతదేశం పనిచేయగల వయసు (15నుంచి 59సం) జనాభా 2011 సంవత్సరంలో 59 శాతం ఉండగా 2022 సంవత్సరం నాటికి 63 శాతానికి పెరిగింది. శ్రామిక శక్తి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి లభించడం లేదు. కొద్ది మందికే పని దొరికిందని నివేదిక తెలిపింది. స్వయం ఉపాధి గణాంకాల విభాగం విడుదల చేసిన జులై 2022 సంవత్సరం నుంచి జులై 2023 సంవత్సరం వరకు కేంద్ర ప్రభుత్వంలో అత్యంత వినాశకర ఉపాధి తీరు వెల్లడైంది. దేశం మొత్తం ఉపాధిలో 58 శాతం స్వయం ఉపాధి పొందుతున్నారు. 2017 సంవత్సరం నుంచి 2018 సంవత్సరంలో వీరు 52 శాతం మాత్రమే ఉన్నారు. దీన్ని గమనిస్తే ప్రభుత్వం కల్పించే ఉపాధి లేక ప్రజలు స్వయం ఉపాధిని ఆశ్రయించడం ఎక్కువైంది. స్వయం ఉపాధి పొందుతున్న వారు చిన్న వ్యాపారులు, చేతి వృత్తిదారులే. ఆర్థికవేత్త సంతోష్ చెప్పిన దాని ప్రకారం స్వయం ఉపాధి కార్మికుల సంఖ్య 2017 సంవత్సరం నుంచి 2018 సంవత్సరంలో నాలుగు కోట్ల మంది ఉండగా 2022 సంవత్సరం నుంచి 2023 సంవత్సరం నాటికి తొమ్మిది కోట్ల, 50 లక్షలకు పెరిగింది. 92 దేశాలు అనుసరిస్తున్న అంతర్జాతీయ కార్మిక సంస్థ సూచించిన పద్ధతి ప్రకారం జీతం చెల్లించని ఇలాంటి వారిని ఉపాధి పొందిన కార్మికులుగా పరిగణించడం లేదు. దీన్ని గమనిస్తే ఉపాధి కల్పనలో ఎంతగా మోడీ ప్రభుత్వం వైఫల్యం చెందింది తెలుస్తుంది. భారత దేశంలో వ్యవసాయరంగం ద్వారానే ఇప్పటికీ ఎక్కువగా ఉపాధి దొరుకుతుంది. నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్‌యస్‌యస్) నివేదిక 38వ రౌండ్ (9183) నివేదిక ప్రకారం 77శాతం గ్రామీణ కుటుంబాలు తమ జీవనోపాధి కొనసాగించడానికి వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉన్నాయి. 2018-19కి సంబంధించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్‌సర్వే తాజా నివేదిక ప్రకారం వ్యవసాయంపై గ్రామీణ కుటుంబాలు ఆధారపడడం 53 శాతానికి తగ్గింది. జాతీయ జిడిపిలో వ్యవసాయరంగం వాటా 43 శాతం నుంచి 16 శాతానికి తగ్గింది. అందుకు కారణం సేద్యపు ఖర్చులు పెరగడం, పంటలకు న్యాయమైన గిట్టుబాటు ధరలు లభించకపోవడం, వ్యవసాయం వల్ల వచ్చే ఆదాయం చాలకపోవడం, అప్పుల పాలుకావడం వల్ల రైతులు వేరే ఉపాధి చూసుకోవడం కారణంగా

**బొల్లిముంత సాంబశివరావు**

చెప్పవచ్చు. ఇదే క్రమంలో గమనించాల్సిన అంశం ఒకటుంది. అది మహిళల వ్యవసాయ ఉపాధి రేటు ఇప్పటికీ 82 నుండి 72 శాతానికి మాత్రమే తగ్గింది. వ్యవసాయ పనులైన నాట్లు, కోత, కలుపు తీయడం, విత్తనాలు వేయడం మొద లైన పనుల్లో మహిళల పాత్ర ఎక్కువగా



ఇప్పటికీ ఉంది. మహిళల ఉపాధి కూడా కొద్దిమేర తగ్గడానికి కొన్ని ప్రాంతాల్లో యంత్రాల వినియోగంతోపాటు ప్రకృతి సృష్టిస్తున్న కరవు, వరదలు కూడా వ్యవసాయరంగంలో ఉపాధి తగ్గడానికి కారణం. వీటిని గమనించినప్పుడు గ్రామీణ ఉపాధికి వ్యవ సాయమే ప్రధానంగా ఉండి అత్యధిక గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నది. మరో ముఖ్యమైన విషయం కూడా గమనించాల్సిన అవసరం ఉంది. 2000 సంవత్సరం నుంచి నుంచి 2012 సంవత్సరం వరకు వ్యవసాయంలో ఉపాధి పొందే వారి వాటా స్వల్పంగా తగ్గినా, మహమ్మారి కొవిడ్ కాలంలో వ్యవసాయరంగమే ఎక్కువ ఉపాధి కల్పిం చింది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధికోసం పట్టణాలకు, నగరాలకు వలసలు వెళ్లిన పేదలు కొవిడ్ వలన ఉపాధి కోల్పో యి తిరిగి గ్రామీణ ప్రాంతాలకు వచ్చిన ప్పుడు వారిని వ్యవ సాయరంగం ఆదు కున్న వాస్తవాన్ని గ్రహిస్తే వ్యవసాయ రంగం ప్రాముఖ్యత తెలుస్తుంది. ఇన్ స్టిట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ అంతర్జాతీయ కార్మికసంస్థ సంయుక్తంగా రూ పొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్టు 2024 ప్రకారం భారతదేశ శ్రామిక జనాభా 2011 లో 61 శాతంగా ఉంటే 2024లో 64 శాతంగా ఉంది. యువత ఉపాధి 37శాతం క్షీణించింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ తాజా వివరాల ప్రకారం మే 2024లో నిరుద్యోగం ఏడు శాతం కాగా, జూన్ 2024లో 9.2 శాతంకి పెరిగింది. కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్ హోల్డ్ సర్వే ప్రకారం జూన్ 2024 లో మహిళా నిరుద్యోగం 18 శాతానికి చేరింది. ఇది జాతీయ సగటు కన్నా ఎక్కువ. 2023 సంవత్సరంలో మహిళా నిరుద్యోగం 15 శాతంగా ఉంది. కార్మికశక్తి వినియోగం 2024 మేలో 40.8 శాతం ఉంటే, జూన్‌లో 41.4 శాతానికి పెరిగింది. పట్టణ నిరుద్యోగం మే 2024 లో 6.3శాతం ఉంటే, జూన్‌లో 8.9 శాతానికి పెరిగింది. భారత దేశ ఉపాధి నివేదిక 2024 ప్రకారం నిరుద్యోగ శ్రామికశక్తిలో దాదాపు 83శాతం యువత ఉన్నది. మొత్తం నిరుద్యోగ యువతలో మాధ్యమిక లేక ఉన్నత విద్యపూర్తి చేసిన యువకులు వాటా 2000 సంవత్సరంలో 32.2 శాతం ఉంటే 2022 సంవత్సరంలో 65.7 శాతానికి పెరిగింది. కేంద్రప్రభుత్వం ఉద్యోగ కల్పన కల్పించకపోగా ఉన్న ఉద్యోగాల్లో కూడా తగ్గించింది. ఫలితంగా నిరుద్యోగం పెరుగుతూ ఉంది. దేశం మొత్తంమీద ఉన్న 389 ప్రభుత్వ రంగ సంస్థల్లో 2014లో 16.9 లక్షల ఉద్యోగాలు ఉండగా, 2022 సంవత్సరంలో ఈ సంఖ్య 14.6 లక్షలకు తగ్గింది. ఒక్క బిఎస్‌ఎన్‌ఎల్‌లోనే గత తొమ్మిది సంవత్సరాల్లో లక్షా 81 వేల మందిని ఇంటికి పంపింది. ఈ విధంగా కేంద్ర ప్రభుత్వ పాలనలో ఉపాధి తగ్గి నిరుద్యోగం పెరిగింది. కేంద్ర ప్రభుత్వం దేశీయ పారిశ్రామిక, వ్యవసాయ విధానాలను అమలు జరపకుండా సామ్రాజ్యవాదుల, దేశ విదేశీ బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూల విధానాలు అమలు జరుపుతూ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను సంక్షోభంలోకి నెట్టిన ఫలితమే నిరుద్యోగం పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ, దేశాభివృద్ధికి తోడ్పడే పారిశ్రామిక, వ్యవసాయ విధానాలు అమలు జరిపి, గ్రామీణ పేదలకు భూ పంపిణీ చేసి పరిశ్రమల్లో కార్మికులకు భాగస్వామ్యం కల్పించి, నిరుద్యోగ సమస్య పరిష్కారమయ్యేలా దేశ ప్రజలు ఉద్యమించాలి.

## భాగ్యలక్ష్మి మందిరంలో గవర్నర్ పూజలు



చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులు

**హైదరాబాద్ (చార్మినార్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ సతీసమేతంగా శుక్రవారం రాత్రి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరాన్ని సందర్శించారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యా దలతో గవర్నర్ దంప తులకు స్వాగతం పలికారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు భాగ్యలక్ష్మి అమ్మ వారి ఆశీస్సులు పొందారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో ప్రతీ సంవత్సరం జరుగుతున్న దీపావళి పండగకు సంబంధించిన ఫోటోలను గవర్నర్ చూశారు. దీపావళి పండుగ అలంకరణ గురించి గవర్నర్‌కు శశికళ వివరించారు. మందిరం తరుపున రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి చిత్ర పటాన్ని మందిరం ట్రస్టీ శశికళ బహూకరించారు. హైదరాబాద్ పాతబస్తీకి గవర్నర్ విచ్చేసిన సందర్భంగా చార్మినార్ పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## రేపటి నుండి శ్రీవారి ఆలయంలో మహాశాంతియాగం

### సంప్రోక్షణతో మూడురోజులు నిర్వహణకు టిటిడి నిర్ణయం

**తిరుమల, సెప్టెంబరు 21 ప్రభాతవార్తప్రతినిధి:** పరమపవిత్రమైన హిందూవుల ఆరాధ్యదైవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూల తయారీలో పందికొవ్వు, గొడ్డుకొవ్వు, ఇతరత్రా పలురకాల నూనెలు వాడారని తేలడంతో, అపవిత్రమైన ఆలయం, పోటును సంప్రోక్షణ చేయడానికి టిటిడి నిర్ణయించింది. క్షమించరాని పాపం నుండి ఈ అపవిత్రత పోగొట్టేందుకు తిరుమలలోనే దేవదేవుని ఆలయంలో మూడురోజులపాటు మహాశాంతియాగం నిర్వహించాలని టిటిడి అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన పనులు, ఏర్పాట్లులో టిటిడి అధికారులు నిమగ్నమయ్యారు. తిరుమలలో లడ్డూలను కల్తీనెయ్యితో తయారు చేశారనే బలమైన ఆధారాలతో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలయంలో సంప్రోక్షణ చేయాలని టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆదేశించారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఆగమశాస్త్రపండితుల సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

## ఆర్వోబీ నిర్మాణాల్లో వేగం పెంచేలా చర్యలు చేపట్టండి

### కొత్త ఆర్‌ఓబిలు మంజూరు చేయండి

### రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరిన ఎంపి అర్వింద్

### అతికొద్ది రోజుల్లో కాజీపేట్-దాదర్ రైలు ప్రారంభం-మంత్రి హామీ

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :** పార్లమెంట్ పరిధిలో ప్రస్తుతం నడుస్తున్న ఆర్వోబిల నిర్మాణాలను వేగవంతం చేసేలా అదికారులకు తగు సూచనలు జారీ చేయాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవిని నిజాంబాద్ ఎంపి అర్వింద్ కోరారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటి అయి, పార్లమెంట్ పరిధిలో రైల్వేలకి సంబంధించి, పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వారానికి ఒకసారి నడిచే కాజిపేట్-దాదర్ రైలుని అత్యంత త్వరగా నడిపి వారానికి మూడుసార్లు నడిచేలా చేయాలని ఎంపి కోరగా, అతి కొద్ది రోజుల్లోగా రైలు నడిచేలా తగు చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. అదే విధంగా పార్లమెంట్ పరిధిలో అవసరమైన చోట్ల కొత్త ఆర్‌ఓబిలు, ఆర్ యుబిల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, దేశ రాజదాని డిల్లీకి నిజాంబాద్ మీదుగా రైలు సర్వీస్‌ని నడపాలని పార్లమెంట్ పరిది మీదుగా తిరుపతి, ముంబైలకు కొత్త రైళ్లను నడపాలని కోరారు. అంతేకాకుండా గత రాష్ట్ర ప్రభుత్వాల జాప్యం కారణంగా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆర్మూర్ ఆదిలాబాద్, బోధన్ బీదర్ రైల్వేలైన్ల మంజూరు చర్యలను వేగవంతం చేయాలని ఎంపి అరవింద్ కోరారు. అమృత్ భారత్ కింద 53 కోట్లతో చేపడుతున్న నిజాంబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు. ఇవే కాకుండా పార్లమెంట్ పరిదిలో రైల్వేల అభివృద్ధికి సంబంధించిన పలుఅంశాలు రైల్వేమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపి పేర్కొన్నారు. తాను చేసిన విజ్ఞప్తుల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించి తగు చర్యలు చేపట్టేలా అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్లు మంత్రి 53 వివరించారని, దానికి వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎంపి అరవింద్ పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సన్మానించిన పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :** పిసిసి ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సన్మానిస్తూ ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఉన్నతికి రాజీలేని పోరాటం చేసిన మీరు అభినందనీయులు అని, ఇక ముందుకూడ మీకు మాకు దిక్సూచిగా అండగా నిలవాలని, మీరు చేసిన సేవలు కాంగ్రెస్‌పార్టీ ఎప్పటికీ గుర్తు చేసుకుంటుందని మున్ముందు మీ సేవలు ఉపయోగించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, త్వరలోనే మిమ్మల్ని ఉన్నత స్థానంలో గౌరవిస్తామని అన్నారు.

## గాంధీ భవన్‌కు వచ్చిన వైసిపి ఎంపి

### మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం చేసిన ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** వైసిపి నుంచి రాజ్యసభలో పార్లమెంట్ సభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న బిసి సంఘం నేత ఆర్ కృష్ణయ్య గాంధీభవన్‌లో కొత్తగా ఎంపికైన టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను శనివారం సన్మానించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిసిలకు రిజర్వేషన్ 42శాతం పెంచాలని, బిసి కులగణన చేపట్టాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కు విజ్ఞప్తి చేశారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన వాగ్ధానం తెలంగాణలో అమలు చేయాలని సూచించారు. అదే విధంగా బిసి విద్యార్థులకు ఫీజు బకాయిలు వెంటనేచెల్లించాలని కోరారు. మహేష్‌కుమార్‌ను సన్మానం చేసే సందర్భంలో బిసి కులగణ డిమాండ్‌ను కాంగ్రెస్‌లో వినిపించే వి.హనమంతరావు కూడా అక్కడే ఉన్నారు.

## ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు తప్పనిసరి

### అక్టోబరు 2నుంచి ప్రత్యేక డ్రైవ్

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో ఇక నుంచి ఇంకుడు గుంత తప్పనిసరి కానుంది. నగరంలో నీటి రక్షణ చర్యల్లో భాగంగా నల్లా కనెక్షన్ ఉన్న వారితో పాటు కొత్త కనెక్షన్ తీసుకోవాలనుకునే వారి ప్రాంగణంలో ఇంకుడుగుంత తప్పనిసరి కానుంది. దీనిపై జలమండలి దృష్టిసారించింది. అక్టోబరు 2వ తేది పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ మార్గదర్శకతంలో ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత అనే పేరుతో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాలని నిర్ణయించారు. నిబంధనల ప్రకారం 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఇళ్లలో తప్పనిసరికానుంది. రానున్న రోజుల్లో తప్పనిసరిగా ఇంకుడుగుంత నిర్మించాలని లేకపోతే నీటి ట్యాంకర్ల ధర రెట్టింపు చేయనున్నారు. ఈ యేడాది వరల్డ్ వాటర్ డే ఇంకుడు గుంతల సర్వే కోసం జలమండలి ఒక అప్లికేషన్‌ను రూపొందించింది. ఈ యేడాది జూన్ 14 నుంచి సర్వే నిర్వహించగా, 42,784 గృహ సముదాయాలను తనిఖీ చేయాలని నిర్ణయించారు.

# పేదల పక్షాన గళం విప్పిన ఏచూరి

### ఆయన మృతి దేశానికి తీరనిలోటు: సిఎం రేవంత్

### ఏచూరి సంస్మరణ సభలో ప్రముఖుల ఘన నివాళులు



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** సహచర కాంగ్రెస్ పార్టీ విధానపరమైన ఆలోచనల్లో విభేదించినా పేదలకు, ప్రజాస్వామ్యవాదులకు ప్రభుత్వ విధివిధానాలు ఉపయోగపడాలని భారతదేశ రాజకీయాల్లో ప్రజాస్వామిక స్ఫూర్తిని రేకెత్తించి పేదలపక్షాల గళంవిప్పిన సీతారాం ఏచూరి మనమధ్యలో లేకపోవడం వామపక్ష పార్టీలతోపాటు దేశ రాజకీయాలకు పూడ్చలేనిలోటని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసమే చివరిశ్వాస వరకు నిలబడిన ఏచూరి ప్రపంచంలోని అన్ని ప్రజాస్వామ్య వేదికలపై దేశకీర్తి గొప్పదనాన్ని చాటిచెప్పారన్నారు. దేశరాజకీయాల్లో జైపాల్‌రెడ్డికి సమకాలికుడుగా సీతారాం ఉండేవారని చెప్పారు. యూపిఏ హయాంలో పేదలకు ఉపయోగపడే కీలకబిల్లులకు మద్దతిచ్చి క్రియాశీలపాత్ర పోషించారని, రాహుల్‌గాంధీ ఆయన్ను మార్గనిర్దేశకుడిగా గురువుగా భావిస్తారని తెలిపారు. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన, దేశంలో అధికారం కోసం జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబళించాలనుకుంటున్న కీలక సమయంలో మనకు దిక్సూచిలా ఉండాల్సిన సమయంలో మనమధ్య లేకపోవడం చాలా బాధాకరమని వాపోయారు. జమిలి ఎన్నికల వ్యతిరేక పోరాటంలో, భాష మత ప్రాంతాలమధ్య చిచ్చుపెట్టి అధికారాన్ని కాపాడుకోవాలనుకొంటున్న బిజెపి విధానాలను కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆలోచనలతో నిలువరిస్తూ ముందుకువెళదామని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సభాధ్యక్షతన జరిగిన ప్రముఖ మార్క్సిస్టు మేధావి, సిపిఐ(ఎం) జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విశిష్ట అతిథులు పార్టీ పాలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, మోహన్‌కందా, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, టిజెస్ రాష్ట్రాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.కోదండరామ్, తమ్మినేని వీరభద్రం తదితర నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి, జోహార్లు అర్పించి సీతాంరాం ఏచూరి క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కె.టి.ఆర్ మాట్లాడుతూ పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయాల్లో స్థిరంగా సిద్ధాంతంపై నిలబడిన సీతారాం ఏచూరి ఎప్పుడు ఏ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల యుగంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన ఆదర్శనేతని కొనియాడారు. ఓట్ల రాజకీయం, ప్రజల రాజకీయం వేరని, తాము ఓట్ల రాజకీయంలో వెనుకబడ్డా ప్రజల కోసం జరిగే పోరాటాల్లో ముందుండి ప్రజల మనస్సులో ఉన్నామని చెప్పిన మాటను గుర్తుచేశారు. తిట్లు, బూతులు, రోతమాటలు రాజకీయంగా చలామణి అవుతున్న ఈరోజుల్లో సీతారాం హుందాతనం భవిష్యత్తు రాజకీయ నాయకులకొక పాఠమని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని రాజకీయం కోసం అపహాస్యం చేస్తున్న నేటికాలంలో రాజ్యాంగాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి ప్రశ్నించడమే ప్రజాస్వామ్యమని ఎలుగెత్తి చాటారన్నారు. పార్టీలు సిద్ధాంతాలు వేరైనా ఉద్యమాల నుండి వచ్చినవాళ్లుగా మా బంధం కలకాలం ఉంటుందని చెప్పారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడు మనమౌనం పనికిరాదన్న ఆయన జీవితం కొత్తతరం నాయకులకు ఆదర్శమని ఘననివాళులర్పించారు. అనంతరం బి.వి.రాఘవులు, మోహన్‌కందా, సాంబశివరావు, కోదండరామ్ తదితర ప్రముఖులు ప్రసంగించి సీతారాం ఏచూరికి ఘననివాళులర్పించారు.

## తిరుమల లడ్డూల్లో అపవిత్ర పదార్థాలా?

### పలువురు మఠాధిపతులు, స్వామీజీల ఆగ్రహం

### సిజెఐ చంద్రచూడ్‌కు లేఖ రాసిన 'సుదర్శన్' పత్రిక ఎడిటర్



**హరిద్వార్, సెప్టెంబరు 21:** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీపై పీఠాధిపతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అపవిత్ర పదార్థాలు వాడారని తెలిసి ఎంతో ఆవేదన కలుగుతోందని అన్నారు. హిందూ దేవాలయాల పరిరక్షణ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు మాట్లాడారు. ప్రసాదంలో ఏంకలుస్తున్నదోనన్న భయంతో భక్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అపవిత్ర పదార్థాల విషయంలోకఠిన చర్యలు తీసుకోవాలి. స్వామి సనిధిలో వేరే మతస్థులకు ఉద్యోగం ఇవ్వకూడదు. శ్రీవారిపై భక్తివిశ్వాసాలు ఉన్నవారికే ఉద్యోగాలి వ్వాలి. ప్రభుత్వం ప్రజలు కలిసి ధర్మాన్ని రక్షించాలని అన్నారు. ల్యాబ్ నివేదికలు మనకు ఆధారమని అవి స్పష్టంచేసినపుడు చర్యలు తీసుకోవాల్సిందేనని ఇంకా తప్పు జరగలేదంటే అపహాస్యమే అవుతుందనిఅన్నారు. ల్యాబ్ నివేదిక ప్రకారం కోర్టుకు వెళ్లాల్సిందే. కోర్టు విధించిన శిక్షలు అమలుచేస్తేనే ఇలాంటివి మరోసారి జరగవని పీఠాధిపతులు పేర్కొన్నారు. హరిద్వార్‌లోని పీఠాధిపతులు కూడా తీవ్ర నిరసన వ్యక్తంచేసారు. ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్‌చేసారు. అఖండపరిషద్ అధనయక్షుడు మహంత్ రవీంద్ర పూరి మాట్లాడుతూ సనాతనధర్మం పాటించేవారి సెంటిమెంట్లను దెబ్బతీసారని, జంతువుల కొవ్వుతో తీసిన నూనెను కల్తీచేసారన్న ఆరోపణలే అసలు జీర్ణించుకోలేకున్నామని అన్నారు. ముందు తయారయిన ప్రసాదాలను నిలిపివేయాలని కొత్తగా తయారీచేయించాలనికోరారు. మహామండలేశ్వర్ స్వామి రూపేంద్రప్రకాష్ మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని అపవిత్రం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని నిందితులకు కఠిన శిక్షలు వేయాలని, కేవలం జగన్‌రెడ్డి ఒక్కరేకాకుండా ఆలయ అధికారులు కూడా నిందితులేనని పేర్కొన్నారు. సుదర్శన్‌న్యూస్ పత్రిక ఎడిటర్ ఇన్ ఛీఫ్.. చీఫ్‌జస్టిస్ డివై చంద్రచూడ్‌కు లేఖరాస్తు హిందూమత సాంప్రదాయాలు, కట్టుబాట్లను అవమానించారని, లక్షలాది భక్తుల మనో భావా లను దెబ్బతీసారని పేర్కొన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలోనే భారీ కుట్ర ఉందని, టిటిడి యాజమాన్య లోపం కూడా ఉందని, మత సాంప్రదాయాలను ఉల్లం ఘించి వ్యవహరించారని, తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## కర్ణాటక ఆలయాల్లో నందిని నెయ్యి మాత్రమే వినియోగించాలి

### కన్నడ ప్రభుత్వం ఆదేశం

**బెంగళూరు, సెప్టెంబరు 21:** తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వును ఉపయోగించారనే వివాదంతో, కర్ణాటక ప్రభుత్వం, రాష్ట్రంలోని 34,000 ఆలయాల్లో నందినీ బ్రాండ్ నెయ్యిని తప్పనిసరిగా ఉపయోగించాలని రాష్ట్ర దేవాలయ నిర్వహణ సంస్థను ఆదేశించింది. కర్ణాటక ప్రభుత్వం కొత్త నిర్దేశంలో రాష్ట్ర పరిధిలోని అన్ని దేవాలయాలు దీపారాధనకు, భక్తులకు పంచే అన్నిరకాల ప్రసాదాలు తయారుచేయటానికి కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కెఎంఎఫ్) ఉత్పత్తి చేసిన నందిని నెయ్యిని ఉపయోగించాలని నిర్దేశించింది. ప్రసాదాల నాణ్యతలో ఎటువంటి రాజీ ఉండకూడదని, ఈ విషయంలో ఆలయ సిబ్బంది కచ్చితత్వంతో ఉండాలని ఆధికారిక ప్రకటన జారీ చేసింది. ఎంతో ప్రాముఖ్యం కలిగి ఉన్న టిటిడి నిర్వహిస్తున్న తిరుపతి వేంకటేశ్వం స్వామి ఆలయంలో లడ్డూ తయారీలో జంతు వుల కొవ్వు కలిసిందన్న వివాదంతో కర్ణాటక ప్రభుత్వం ఈ విధమైన ఆదేశాన్ని జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తిరుపతి ప్రసా దాల్లో కల్తీ గురించి, లడ్డూల్లో జంతువుల కొవ్వు కలిపారన్న వ్యాఖ్య లతో పెద్ద దుమారం చెల రేగింది. ప్రసాదాల శాంపిల్స్‌ను పరీక్షించగా పందికొవ్వు, ఇతర జంతువుల కొవ్వు ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు.

## అత్యాచార నిందితుల అరెస్టు

**మేడ్చల్, సెప్టెంబరు 21. ప్రభాతవార్త:** ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ ఇద్దరు నిందుతలను మేడ్చల్ పోలీసులు అరెస్టు చేశారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండలంలోని బండమాదారం గ్రామంలో భర్త చనిపోయిన ఓ 64 ఏండ్ల మహిళ తన కుమార్తెతో నివాసముంటున్నది. ఈ నెల 19వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె ఇంటికి అదే గ్రామానికి చెందిన కరెంట్ పోల్‌మెన్‌గా పనిచేస్తున్న వెంకట్‌రావు (26) వచ్చి తన భార్య ఊరికి వెళ్లిందని చెప్పి తనకు అన్నం వండమని కోరాడు. అందుకు అంగీకరించిన ఆమె వెంకట్‌రావుతో కలిసి అతని ఇంటికి వెళ్లింది. కొంత సమయం తర్వాత వెంకట్‌రావు ఇంటికి మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన విద్యుల్ బిల్ కలెక్టర్ నవాజ్ (20) వచ్చాడు. అనంతరం వారిద్దరు ఇంటి బయట మద్యం సేవించడం ప్రారంభించారు. ఈ క్రమంలో అన్నం వండిన ఆమె తన ఇంటికి వెళ్లిపోతానని వెంకట్‌రావుతో చెప్పగా మాకు ఇద్దరికి అన్నం వడ్డించమని చెప్పి తన కూతురితో పాటు ఇక్కడే పడుకోమని వెంకట్‌రావు చెప్పాడు. ఆమె తిరస్కరించినా అతను బలవంతం చేయడంతో అక్కడే ఉండిపోయింది. అనంతరం ఆమెను మద్యం సేవించాలని కోరగా ఒప్పుకోకపోగా బలవంతంగా మద్యం తాగించారు. దీంతో మగతగా అనిపించడంతో ఆమె వెంకట్‌రావు కూతురు వద్ద పడుకుని నిద్రలోకి జారుకుంది. ఈ సమయంలో వెంకట్‌రావు అమెపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం నవాజ్ కూడ లైంగికదాడి చేశాడు. ఆ సమయంలో కేకలు వేసిన ఆమె బలహీనత కారణంగా వారిని అడ్డుకోలేకపోయింది. తీవ్ర రక్తస్రావంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అనంతరం వెంకట్‌రావు తన కూతురితో కలిసి సోదరి ఇంటికి వెళ్లిపోగా నవాజ్ కూడ అక్కడి నుండి జారుకున్నాడు. తిరిగి 20న ఉదయం వెంకట్‌రావు ఇంటికి వచ్చి చూడగా ఆమె అపస్మారక స్థితిలో పడి ఉన్న విషయాన్ని చూసి భయపడి అక్కడి నుండి పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితులను ఇద్దరికి అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెఇపారు.

## తిరుమలేశుని లడ్డూ ప్రసాదంలో కల్తీ దిగ్భ్రాంతికరం

### భక్తుల విశ్వాసం, మనోభావాల పరిరక్షణకు కృషి చేయాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్షదైవం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కొంగు బంగారం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న సమాచారం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతియేటా కోట్లాది మంది దర్శించుకునే తిరుమతి వెంకటన్న లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం అనేది ప్రజల విశ్వాసానికి తూట్లు పొడవటమే అన్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేనని, ఇది క్షమార్హం కాదన్నారు. కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసిన నేరస్తులకు తగిన శిక్ష పడాలన్నారు.

ఈ దిశగా పోలీసు యంత్రాంగం దర్యాప్తు, సంస్థలు ముందుకు వెళ్లాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి కాకుండా, దేశ విదేశాలల నుంచి నిత్యం లక్షలాది భక్తులు తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారన్నారు. పరమ పవిత్రమైన, ఎంతో ప్రశస్తమైన లడ్డూ ప్రసాదానిన సేవిస్తారన్నారు. అప్పుడే తమ దైవ దర్శనం పూర్తయిందని భక్తులు భావిస్తారు. ఇంత పవిత్రంగా భావించే ఈ లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులను, చేపనూనెలను వినియోగించడం క్షమించరాని నేరం. ?లాంటి దురాగతానికి బాధ్యులైన వారందరిని గుర్తించి తగిన శిక్ష పడేలా చేయాలన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటలలేవి పునారవృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు తిరుపతిలో అన్యమత ప్రసారం, తిరుమల కొండపైకి మద్యం, మాంసాహారాన్ని తీసుకెళ్లడం, టిటిడిలో అవినీతి అక్రమాలు, గత కొన్ని రోజులు పతాక శీర్షికలుగా వస్తున్నాయన్నారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర గతంలో జరిగిన నేపథ్యంలో వీటన్నిం టిపై సమగ్ర దర్యాప్తు జరి పించి, బాధ్యుతలను శిక్షించి, తిరుమల పవిత్రతను కాపాడి, భక్తుల మనోభావాలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని ఏపి ప్రభుత్వాన్ని కోరారు. కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశాన్ని సంచలనా త్మకంగా మార్చవద్దని రాజ కీయ పార్టీలకు, ధార్మిక సంస్థ లకు విజ్ఞప్తి చేశారు. పదేపదే తిరుపతి లడ్డూ అపవిత్ర మైనందన్న వార్తలు భక్తుల నమ్మకం, విశ్వాసం సడేలే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో బాధ్యతతో వ్యవ హరించి సంయమనం పాటించాలన్నారు. ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి నిత్యం వెంకటేశ్వరస్వామిని దర్శిం చుకునే లక్షలాది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు, వారి మనోభావాలను పరిరక్షించేందుకు కృషి చేయాలన్నారు.

## ఎత్తిపోతలకు అనుగుణంగా బ్యారేజీల నిర్మాణం జరగలేదు

### నాణ్యతా ప్రమాణాల తనిఖీకి రెండుమూడు నెలలకోసారి సందర్శించాం

### జస్టిస్ పిసి ఘోష్ ముందు క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ల వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ బ్యారేజీలు, పంపుహౌజ్‌లు ఎత్తిపోతలకు అనుగుణంగా నిర్మించలేదని క్వాల్టీ కంట్రోల్ ఇంజనీర్లు జస్టిస్ పిసిఘోష్ ఎదుట వాగ్మూలం ఇచ్చారు. శనివారం పిసిఘోష్ కాళేశ్వరం ఆనకట్టలపై విచారణ చేస్తున్న జస్టిస్ పిసిఘోష్ కమీషన్ ముందు క్వాల్టీ కంట్రోల్ విభాగం ఇంజనీర్లు హాజరయ్యారు. నీటిపారుదలశాఖ ప్రధాన కార్యాలయం జలసౌధాలో కమిషన్ ముందు జరిగిన విచారణలో క్వాల్టీ కంట్రోల్ ఇంజనీర్లుగా పనిచేసిన ఇఇ, సిఇ ఎస్ఇ వచ్చి వాగ్మూలం ఇచ్చారు. ఆనకట్ట నిర్మాణసమయంలో నాణ్యతా ప్రమాణాలు తనిఖీచేసేవారా అని జస్టిస్ పిసిఘోష్ ఇంజనీర్లను ప్రశ్నించారు., క్వాల్టీ వింగ్ నిర్మాణం జరిగాక, జరుగుతున్నప్పుడు నిర్వహించాల్సిన పాత్రను ఆయన అఫిడెవిట్‌ల ఆధారంగా అడిగారు.

బ్యారేజి సైట్ ఎన్నిరోజులకొకసారి సందర్శించాలని ఆయన క్వాల్టీ కంట్రోల్ అధికారులను అడిగారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సబంధించిన అంశాలపై కమీషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. క్వాల్టీ కంట్రోల్ అధికారులు గతంలో దాఖలు చేసిన అఫిడవిట్లు ఆధారంగా నాణ్యత పనులు రికార్డు చేసిన ఎంబి బుక్కులు అనుసరించిన విధానాలపై జస్టిస్ పిసిఘోష్ పలు ప్రశ్నలు వేయడంతో కాల్టీ కంట్రోల్ అధికారుల తడబడినారు.

అధికారులు పొంతనలేని సమాధానాలు చెప్పారు. బ్యారేజి సైట్‌కు వెళ్ళలేదని కొందరు నెలకోమారు తనిఖీచేశామని కొందరు రెండు, మూడు నెలలకొక మారు వెళ్ళామని తెలిపారు. అన్నారం బ్యారేజి డిజైన్ సరిగా చేయలేదని నిర్మాణం సమయంలో నే తెలిపామని క్వాల్టీ ఇంజనీర్లు అన్నారను. వరదకు తగ్గట్టు గాలేదని డిజైన్ చేసిన వరదకు ఇఇ కమిషన్‌కు తెలిపారు.


## వార్త జర్నలిజం కళాశాల

తెలుగు మీడియా రంగాన్ని కొత్తపుంతలు తొక్కించి జన బాహుళ్యంలో చెరగని ముద్ర వేసిన 'వార్త' దినపత్రిక ఎందరో సుశిక్షితులైన జర్నలిస్టులను తీర్చిదిద్దింది.

వృత్తిపట్ల ఆసక్తి
నిబద్ధత
సత్యనిష్ఠ

ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం

ఎంపిక విధానం

రాత పరీక్ష తప్పనిసరి: వర్తమాన, సమకాలీన సామాజిక, రాజకీయ, అభివృద్ధి అంశాలపై పరీక్ష రాయాల్సి ఉంటుంది.
తెలుగు-ఆంగ్లం ప్రతిని తెలుగులోకి అనువాదం చేయగలిగి ఉండాలి.
సమకాలీన వ్యవహారాలపై వ్యాసాన్ని మీ ఆన్‌లైన్ దరఖాస్తుకు జత పరచాలి. స్కాన్డ్ కాపీని పంపితే చాలు.

- తెలుగు ఆంగ్ల భాషా పరిజ్ఞానం
- వర్తమాన వ్యవహారాలపై కనీస అవగాహన,
- మీడియా రంగంపై అభిరుచి
- ప్రజాకాంక్షలకు నిలువుటద్దంగా ఉండాలన్న తపన

అభ్యర్థుల ఎంపిక సంస్థ నియమనిబంధనలకు లోబడి ఉంటుంది.

కోర్సు కాల పరిమితి: 9 నెలలు
క్షేత్రస్థాయి శిక్షణ: 3 నెలలు
ఆపై 3 నెలలు డెస్క్‌లో పని చేయాల్సి ఉంటుంది.

స్టైపెండ్: రూ 10,000

విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వారికి 'వార్త' దినపత్రికలో ఉద్యోగావకాశాన్ని కల్పిస్తుంది. ఈ తరుణంలో విశేష ప్రతిభ చూపిన వారికి ముందుగానే ఉద్యోగావకాశం దొరుకుతుంది. ఇందులో సాఫల్యత సాధించిన వారికి సంస్థ నియమనిబంధనల మేరకు జీత భత్యాలు ఉంటాయి.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని అన్ని 'వార్త' పత్రిక కేంద్రాలలో..

అంగీకార పత్రం: ఈ ఏడాది కాలపు శిక్షణ, ప్రొబేషన్ పీరియడ్ కాలంలో శిక్షణ పొందిన వారు మా వద్ద విధిగా కనీసం రెండు సంవత్సరాల పాటు పని చేయుటకు సిద్ధపడుతూ ఒక అంగీకార పత్రాన్ని ఇవ్వాల్సి వుంటుంది.

అర్హత: ఏదేని డిగ్రీ చదివిన వారు
వయసు: 30 సంవత్సరాలలోపు
దరఖాస్తు చేయుటకు చివరి తేదీ: 30-9-2024
ప్రవేశ పరీక్ష: 05-10-2024
కోర్స్ ప్రారంభం: 21-10-2024
శిక్షణ కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ
దరఖాస్తులను hrd@vaartha.com కి పంపాలి.

వార్త జర్నలిజం కళాశాల
వార్త కాంపౌండ్, డోర్.నం.396,
డిబిఆర్ మిల్స్ రోడ్
లోయర్ ట్యాంక్‌బండ్,
హైదరాబాద్-500086- తెలంగాణ

# తెలంగాణ ఉద్యమ మార్గదర్శి కొండా లక్ష్మణ్‌బాపూజీ



### మంత్రి కొండా సురేఖ

### హాండ్లూమ్ టెక్స్టైల్ యూనివర్సిటీకి కొండా పేరు హార్షణీయం : పొన్నం

### కొండా లక్ష్మణ్ 12వ వర్థంతి సందర్భంగా గాంధీభవన్‌లో నివాళులు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమానికి కొండాలక్ష్మణ్ మార్గదర్శిగా వ్యవహరించారని బలహీన వర్గాలు రాజకీయంగా ఎదగడానికి స్ఫూర్తిగా ఆయన నిలిచారని దేవా దాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కొండ లక్ష్మణ్ 12వ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో ఏఐసిసి కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, టిపిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటంకు పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండసురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరై ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజి జయంతిని 27వతేదిన ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

హాండ్లూమ్ టెక్స్‌టైల్ యూనివర్సిటికి కొండా లక్ష్మణ్‌బాపూజి పేరును పెట్టాలని శుక్రవారం క్యాబినెట్ ఆమోదించిందని ఇది బిసిల ఆత్మగౌరవ సంకేతం అని ఆయన అన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా నాకు తెలంగాణ అంశాలలో మార్గదర్శకుడిగా ఉన్నారని అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజికి సముచిత స్థానం గతపది సంవత్సరాలుగా ఇవ్వలేదని ఆవేదన చెందారు. బలహీన వర్గాల మంత్రిగా ఆయన పేరును తెలంగాణలో చిరస్థాయిలో ఉండేందుకు కృషిచేస్తానని పొన్నం శపథం చేశారు.



మహిళా సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి తదితరులు

## అన్నిరంగాల్లో రాణిస్తోన్న మహిళలు

### జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎం) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా అధ్యాపకుల సదస్సు ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ఉందన్నారు. వారిని ప్రతి ఒక్కరు గౌరవించాలని పేర్కొన్నారు.

**క్రియేటివ్‌గా ఆలోచించండి: ఎంపి సుధామూర్తి**

క్రియేటివ్‌గా ఆలోచించాలని సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉండాలని రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి పేర్కొన్నారు. ఈ సదస్సుకు రావడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు పురుషులతో పోలిస్తే స్మార్ట్ అన్నారు. ప్రకృతి మనకు చాలా నేర్పుతుందన్నారు. మహిళలు దేనికైనా అడ్జెస్ట్ అవ్వగలరన్నారు. ఒక్కొక్క బంధంలో అడ్జెస్ట్ అవ్వగలరని, అవసరమైతే కంట్రోల్ చేయ గలదన్నారు. దేశంలో అనేకమంది ఉపాధ్యాయురాళ్లు ఉన్నారని తెలిపారు. జీవితంలో అనేక సమస్యలు చూశానని సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉండా లన్నారు.

స్థితప్రజ్ఞత ఉండాలని విద్యకు లింగభేదం లేదన్నారు. విద్యా అందరి హక్కు అన్నారు. అందరు క్రియేటివ్‌గా ఆలోచించాలన్నారు. కష్టాలు, సుఖాలు వస్తాయని కానీ ఏది శాశ్వతం కాదన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ రీసర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్)తో కలిసి ఏర్పాటు చేసిన ఈ సదస్సు ఎన్విజనింగ్ న్యూభారత్ అనే థీమ్ ఆధారంగా సాగుతుందని, మహిళా అధ్యాపకుల అధికరణ లక్ష్యంగా ఈ సదస్సు జరిగింది.

తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 1200 మందికిపైగా మహిళా అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో దేశ నిర్మాణంలో మహిళల పాత్ర... వారి హక్కులు, వారికి ఎదురైన సవాళ్ల వంటి కీలక అంశాలపై చర్చించారు. అనంతరం 200కిపైగా పరిశోధనా పత్రాలు సదస్సులో చర్చించారు.

## తెలుగు విశ్వవిద్యాయానికి సురవరం పేరు హార్షణీయం

### గోల్కొండ సాహితీ సమితి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయానికి ప్రముఖ రచయిత, సాహితీవేత్త సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు నామకరణ చేయాలని కేబినేట్ నిర్ణయించడం పట్ల గోల్కొండ సాహితీ సమితి హర్షం వ్యక్తం చేసింది. సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర క్యాబినేట్ మంత్రులకు సమితి ధన్యవాదాలు తెలిపింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు సురవరం కృష్ణవర్థన్, ప్రతినిధులు, సాహితీ వేత్తలు ఘంటా మనోహార్‌రెడ్డి, రామకృష్ణచంద్రమౌళి, మేక రవీందర్, బడె సాహెబ్, రఘుశ్రీ, సంపంగి నర్సింగ్ తదితరులు మాట్లాడుతూ గత పది సంవత్సరాల క్రితమే తెలుగు విశ్వవిద్యాలయంకు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలని కోరడం జరిగిందన్నారు. కాగా ఇటీవల రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుకు తమ సమితి విజ్ఞప్తి చేసిందని, దీంతో మంత్రి సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారని, మంత్రి హామీ ప్రకారం కేబినేట్‌లో చర్చించి ప్రకటన చేసినందుకు ప్రత్యేకంగా వారు ధన్యవాదాలు తెలియజేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## ప్రజల్లో సమానత్వాన్ని పెంపొందించాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** సమాజ మార్పులో భాగంగా ప్రజల్లో సమానత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ప్రతీక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల అత్యాచారాల కేసులకు సంబంధించిన విషయాలపై సమీక్షించారు. సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ.. నేర ప్రవృత్తి, వివక్షకు తావులేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యాచార నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలుపరచాలని ఆయన తెలిపారు. అత్యాచార కేసులకు సంబంధించి పోలీస్ అధికారుల సహకారం తీసుకుంటూ సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డివిఎంసి సభ్యులకు సూచించారు. దళితులు ఎలాంటి వివక్షకు గురికాకుండా వారిలో మనస్థయిర్యాన్ని పెంపొందించేలా అధికారులు ప్రత్యేక దృషి సారించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం ప్రాముఖ్యతను కళాబృందాల ద్వారా అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారాన్ని అతిత్వరలో ఇవ్వనున్నట్లు స్పీకర్ హామి ఇచ్చారు. ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించి సమస్యల పరిష్కారానికి పోలీస్, రెవెన్యూ అధికారులు కృషి చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, సుధీర్, డిఎస్సిడిఓ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న ఉద్యోగిని పరమార్శిస్తున్న ఆర్టీసీ ఎండి సజ్జనార్

## ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠినచర్యలు

### సంస్థ ఎండి సజ్జనార్

**హైదరాబాద్ (తార్నాక), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** విధినిర్వాహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై ఎవరైనా దాడులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. పోలీసు శాఖ సహకారంతో నిందితులపై రౌడిషీట్స్ తెరుస్తామని హెచ్చరించారు. దాడికి గురై తార్నాక ఆర్టీసీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కుషాయిగూడ డిపో డ్రైవర్ ధరవాత్ గణేష్‌ను ఎండీ పరమార్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. దాడి జరిగిన తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ దాఢికి గురైన ఉద్యోగులకు ఆర్టీసీ అండగా ఉంటుందన్నారు. గాయాలకు గురైన గణేష్‌కు మెరుగైన చికిత్సచేయించాలని వైద్యులకు సూచించారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్లుతున్న రూట్ నెం. 231బై 1 మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులోవిధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్‌ను అకారణంగా దాడి చేశారని చెప్పారు. ఈ ఘటనలో డ్రైవర్‌ది ఎలాంటి తప్పులేదన్నారు. బైకులపై వచ్చి ఉద్దేశపూర్వకంగా దుండగులు దాడికి పాల్పడ్డారని తెలిపారు. వారిపై పలు సెక్షన్లకింద కేసులు నమోదు అయ్యాయన్నారు. ఐదుమంది దుండగులను అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. తమ సిబ్బంది ఆత్మస్తైర్యాన్ని దెబ్బతీసే, మనోవేదనకు గురిచేసే ఇలాంటి దాడులను ఏ మాత్రం సహించబోమన్నారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. డ్రైవర్‌ను పరమార్శించిన వారిలో ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శైలజా మూర్తి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డా. శ్రీనివాస్, ఓఎస్డీ సైదిరెడ్డి, ఆర్ఎం ఖుస్రోషాఖాన్ తధితరులు పాల్గొన్నారు.

**కండక్టర్, డ్రైవర్‌ను అభినందించిన ఎండి సజ్జనార్**

టీజీఎస్ ఆర్టీసీ బస్‌లో గుండెపోటు వచ్చిన ప్రయాణికుడిని సీపీఆర్ చేసి కాపాడిన కండక్టర్, డ్రైవర్‌ను ఎండీ వీసీ సజ్జనార్ అభినందించారు. హైదరాబాద్ బస్ భవన్‌లో శనివారం జీడిమెట్ల డిపోకు చెందిన కండక్టర్ అంజలి, డ్రైవర్ సైదులును అధికారులతో కలిసి ఎండి సన్మానించి అభినందించారు.

## రెండోవిడత స్కూల్ గ్రాంట్స్ నిధుల విడుదల

### రూ. 48 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌కి ఇచ్చే గ్రాంట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, క్రీడా పాఠశాలలకి సంబంధించిన రెండోవిడత గ్రాంట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం రూ. 48,86,07,500ను విడుదల చేసింది. ఇందులో కంపోజిట్ స్కూల్ గ్రాంట్స్ రూ. 36,43,27,500 ఉండగా.. స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ రూ. 12,42,80,000 ఉన్నాయి. మొత్తం రూ. 48.86 కోట్లను మంజూరు చేశారు. వాటిలో స్కూల్స్‌కి సంబంధించి కరెంటు బిల్లులను చెల్లించాల్సిన అవసరం లేదని.. కరెంటు బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. కరెంటు బిల్లులు కాకుండా ఇతర అవసరాల కోసం ఉపయోగించుకోవాలని ఉత్తర్వులో స్పష్టం చేసింది. రాష్ట్రంలో 26,387 స్కూల్స్‌కి గ్రాంట్లను విడుదల చేస్తున్నట్టు స్పష్టం చేశారు. వెయ్యి మందికంటే ఎక్కువ విద్యార్థులున్న పాఠశాలలకి రూ. లక్ష ఇస్తుండగా.. అటువంటిది కేవలం ఒకే ఒక్క పాఠశాల ఉంది. 251 నుంచి 1000 మంది వరకు ఉన్న పాఠశాలలు 277 ఉన్నాయి. 101 నుంచి 250 వరకు ఉన్న పాఠశాలలు 3050 వరకు ఉన్నాయి. 31 నుంచి 100 మంది విద్యార్థులుంటే వారికి రూ. 25000 ఇవ్వనున్నారు. అటువంటి పాఠశాలలు 9100 ఉన్నాయి. 30 మంది లోపు ఉన్న పాఠశాలలకి రూ. 10వేలు ఇస్తుండగా.. అటువంటి స్కూల్స్ 8914 ఉన్నాయి.

స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేయడంపై పీఆర్‌టీయూ టీఎస్ హర్షం వ్యక్తం చేసింది. 2024-25 విద్యా సంవత్సరం కంటిన్‌జెన్సీ నిధులు మరియు క్రీడా నిధులు విడుదలపై సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలలకి సంబంధించి విద్యుత్ బిల్లులను కంటిన్‌జెన్సీ నిధుల నుంచి మినహాయించి ప్రభుత్వమే చెల్లించే విధంగా ఉత్తర్వులివ్వడం శుభపరిణామం అన్నారు.

### తెలంగాణ సాధన కోసం తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో

## కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర మరువలేదనిది: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బాపూజీకి నివాళులు అర్పించిన నేతలు



**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ సాధన కోసం తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో బాపూజీ పాత్ర మరువలేనిదని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపి లక్ష్మణ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం పోరాటంలో బ్రిటీషర్లకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ తనదైన పాత్రను నిర్వహించారు. విలువలతో కూడిన రాజకీయాలకు పెట్టింది పేరు. తెలంగాణ సాధన కోసం తొలిదశ ఉద్యమ సమయంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ఉద్యమానికి ఊపిరి పోసి మహానుభావుడు. శాసనసభ్యుడిగా, మంత్రిగా, ఉపసభాపతిగా ఎన్ని బాధ్యతలు చేపట్టినా బాధ్యతలకే వన్నెతెచ్చారని, పదవుల కోసం ఎప్పుడు ఆరాటపడలేదన్నారు. చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం చేసిన కృషి అమోఘం, రాష్ట్రంలో దేశంలో వ్యవసాయం తరువాత చేనేత రంగంపైనే ఎక్కువ ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మలిదశ ఉద్యమంలో టిఆర్ఎస్‌న పార్టీ పుట్టినప్పుడు సొంత ఇంటిని ఆ పార్టీ కార్యాలయంగా కేటాయించి తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసారన్నారు. ఎముకలు కొరికే చలిలో ఢిల్లీలో సత్యాగ్రహ దీక్షను చేపట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించి, కెసిఆర్ ముఖ్యమంత్రి అయిన తరువాత బాపూజీని ఆయన విస్మరించారన్నారు. రాహుల్‌గాంధీ చవకబారు రాజకీయాలు చేస్తున్నారన్నారు. పొద్దున లేస్తే కులగనన గురించి మాట్లాడే కాంగ్రెస్ పార్టీ తొమ్మిది నెలలు గడిచినా తెలంగాణలో ఎందుకు గణన చేయలేదన్నారు. స్వాతంత్ర్యం తరువాత 50 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు కులగణన చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అవకాశవాద, చవకబారు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు స్థానిక సంస్థలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చెప్పారు. అయితే ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. ఢిల్లీ కాంగ్రెస్, తెలంగాణ కాంగ్రెస్ రెండు వేరువేరా?అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజలు సైతం గమనించాలన్నారు.

## ఇద్దరు చిన్నారులపై మైనర్ లైంగికదాడి

### మరో చిన్నారిపైనా అఘాయిత్యానికి యత్నం

### బాలునిపై పోక్సో కేసు నమోదు

**ఇల్లెందు టౌన్, ప్రభాతవార్త:** సభ్యసమాజం తలదించుకునేలా అభంశుభం తెలియని మైనర్ చిన్నారులపైనా లైంగిక దాడులు, అత్యాచారాలకు అంతుపొంతూ లేకుండా పోతోంది. ఒక మైనర్ ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడులు జరిపి మరో చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడబోవడంతో బాధిత చిన్నారి తప్పించుకున్న సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో జరిగింది. పట్టణంలోని నిర్వాసిత కాలనీలో శుక్రవారం ఓ మైనర్ పక్క ఇంట్లో ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై లైంగికదాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగని మైనర్ మరో చిన్నారిని సైతం కత్తితో బెదిరించి అఘాయిత్యానికి పాల్పడబోగా ఆ చిన్నారి ఏడుస్తూ తప్పించుకుపోయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఘటన వెలుగులోకి వచ్చిన తరుణంలో సీడీపీవో అరుణకుమారి బాధిత చిన్నారుల తల్లిదండ్రులను విచారిస్తూ వారి నోర్లను ముందుగానే మూయించిన పలువురు పెద్దమనుషులు ఏం జరగలేదని సాయంత్రం వరకు సీడీపీవో అధికారికి విన్నవించినట్లు తెలుస్తోంది. ఏమీ జరగలేదని లిఖిత పూర్వంగా రాసివ్వాలని కోరిన తరుణంలో పునరాలోచనలో పడ్డ తల్లిదండ్రులు భవిష్యత్తులో చిన్నారులకు ఏదైనా ఇబ్బందులు ఎదురైతే పరిస్థితి ఏంటని భావించారో తెలియదు కానీ తమ పిల్లలపై అత్యాచార యాత్నానికి పాల్పడ్డట్టు మైనర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. లైంగిక దాడికి పాల్పడిన మైనర్‌ను తప్పించేందుకు ఆ కులానికే చెందిన పెద్దమనుషులు ఏకంగా చిన్నారుల తల్లిదండ్రులను బెదిరించడంతో పాటుగా విషయాన్ని బయటకు చెబితే కులం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మైనర్‌పై పోక్సో కేసు నమోదు: సిఐ బత్తుల సత్యనారాయణ**

ఇద్దరు మైనర్ చిన్నారులపై లైంగిక అత్యాచారానికి పాల్పడినట్లు మరో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడుతుండగా తప్పించుకుపోయిన సంఘటనకు సంబందించి చిన్నారుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనర్‌పై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## దూల్‌పేటలో గంజాయిని అరికట్టేందుకు 8 బృందాలు

### విస్తృతంగా సోదాలు, తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసుల



దూల్‌పేటలో అబ్కారీ పోలీసులు తనిఖీలు

**హైదరాబాద్ (గోషామహల్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఒకప్పుడు గుడంబాకు అడ్డగా పేరుగాంచిన దూల్‌పేటలో ప్రస్తుతం గంజాయి అమ్మకాలు చేసే కలుపు మొక్కలను ఏర్ల నుంచి పెకలించేందుకుగాను నిత్యం తెలంగాణ ప్రభుత్వం ఆ దేశాల మేరకు తెలంగాణ ఎక్సైజ్ శాఖ, అబ్కారీ టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ బృందాలు విస్తృత్తంగా దూల్‌పేట తనిఖీలు, సోదాలు చేస్తూ జల్లెడ పడుతున్నారు. దూల్‌పేటలో గుడంబాను అరికట్టమని, గంజాయిన్ని నిర్మూలించి తీరుతామంటున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి అంజిరెడ్డి నేతృత్వంలో 8 బృందాలు దూల్‌పేటలో 8 బృందాలుగా రంగంలోకి దూల్‌పేట పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు చేస్తున్న వారి నివాసాల్లో సోదాలు, తనిఖీలు చేస్తున్నారు. దూల్‌పేట ప్రాంతానికి చెందిన ఓ మహిళా కిరాణా షాపుల్లో పసుపు ప్యాకెట్లలో గంజాన్ని నింపి అమ్మకాలు చేస్తున్నట్లు నిఘా వేసి పట్టుకున్నారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఎలా గంజాయిన్ని అరికట్టాలని ఎత్తులు వేస్తుండగా, గంజాయి వ్యాపారులు, పైఎత్తులు వేస్తున్నారు. గంజాయికి కళాశాలల్లో చదువుకునే యువకులు, అత్యధికంగా అలవాటు పడుతున్నారని ఎక్సైజ్ పోలీసుల విచారణలో తేలింది. అడుగుడుగునా గండం, దూల్‌పేట గంజాయికి సుడిగుండగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు చాలెంజ్‌గా తీసుకుంది.

ఏదిఏమైనప్పటికి తెలంగాణ రాష్ట్రంలో గంజాయిన్ని పూర్తిగా నిర్మూలిం చేందుకుగాను ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల చెందిన అధికారులు జోరుగా తనిఖీలు చేస్తున్నారు. గంజాయి మూలాలను తెలుసుకుని వాటిని పేకలిచ్చేందుకు కంకణం కట్టుకున్నారు.

గంజాయి వస్తుందో వాటి మూలాలను తెలుసుకుని ప్రత్యేక నిఘా పెట్టి దూల్‌పేటలో గంజాయిన్ని లేకుండా చేయాలనేది ప్రభుత్వం లక్ష్యం, దూల్‌పేటలో గంజాయి అమ్మకాలు చేయాలంటే వణుకుపుట్టించేలా రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుని ముందుగా ఆపరేషన్ దూల్‌పేట్ పేరిట ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంటెంట్ అధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసు బృం దాలతో దూల్‌పేట ప్రాంతంలో గంజాయి నిర్మూలనకై దూల్‌పేటలోని బలరాంగలీ, జాలి హన్ మాన్, టక్కర్‌వాడి, జీన్సిచౌరాహి, అప్పర్ దూల్‌పేట, మాగ్రా, మంగళ్‌హాట్, గంగాబౌలి, ఇమ్లీయాబాగ్ తదితర ప్రాంతాలల్లో ఎక్సైజ్ పోలీసులు బృందా లను రంగంలో దింపి క్షుణంగా తనిఖీలు, సోదాలు నిర్వహించారు.



## టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం పనిచేయాలి

### కార్పొరేట్, ప్రైవేటు హాస్పిటళ్లలో నిత్యం తనిఖీలు జరపాలి

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో నిత్యం తనిఖీలు జరపాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అధికారులను ఆదేశించారు. తనిఖీల వివరాలను ప్రతినెలా తనకు నివేదిక రూపంలో అందించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి దామోదర రాజనరసింహ శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ డాక్టర్ వాణి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఫుడ్ సెక్యూరిటీ అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్స్‌లోని డైట్ క్యాంటీన్లను తనిఖీ చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాల హెచ్‌వోడీలు నెలకు కనీసం రెండుసార్లు జిల్లాల్లోని హాస్పిటల్స్‌ను విజిట్ చేయాలన్నారు. హాస్పిటల్ హెచ్‌ఆర్, అటెండెన్స్, ఎక్విప్‌మెంట్, మెడిసిన్, సానిటేషన్, డైట్ ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి అధికారులకి సూచించారు. ట్రైబల్ ఏరియాల్లోని గర్భిణుల ఆరోగ్యంపై ఎక్కువగా ఫోకస్ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్(ఈడీడీ) వివరాలతో ఓ క్యాలెండర్ మెయింటెన్ చేయాలని, ట్రైబల్ ఏరియాల్లో ఉన్న గర్భిణులను ఈడీడీ కంటే వారం రోజుల ముందే సమీపంలోని హాస్పిటల్‌కి తరలించి వారికి బర్త్ వెయిటింగ్ రూమ్స్‌ను అలాట్ చేయాలని సూచించారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న హాస్పిటల్స్ అభివృద్ధిపై ఎక్కువ ఫోకస్ చేయాలన్నారు. వాటి అభివృద్ధికి తగిన ప్రతిపాదనలు తయారు చేసి తనకు ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. డీఎంహెచ్‌వో, హాస్పిటల్ సూపరింటెండెంట్స్, టాస్క్‌ఫోర్స్ కమిటీలపై ప్రతినెలా సమీక్ష చేస్తానని అధికారులకు చెప్పిన మంత్రి రివ్యూకి అన్ని వివరాలతో రావాలని ఆదేశించారు.




## రాహుల్ తల తీసుకురావాలనడం గర్హనీయం

### బిజెపి వారు హిందూ తాలిబన్‌గా వ్యవహరిస్తున్నారు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అరాచకంగా వ్యవహారిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. దేశంలోని మత పరిస్థితులపై వ్యాఖ్యలు చేసినందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తల తీసుకురావాలని బీజేపీ నాయకులు పిలుపునివ్వడం గర్హనీయమన్నారు. తలలు తీసుకువచ్చే సంస్కృతి ఎవరిదో బీజేపీ సమాధానం చెప్పాలని కూనంనేని డిమాండ్ చేశారు. హిందూమతం పేరుతో అరాచకాలు సృష్టిస్తున్న బీజేపీ వారు నిజంగా హిందూ తాలిబన్లని విమర్శించారు. హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఉన్న పార్టీ రాష్ట్ర కార్యాలయం ముగ్ధూం భవన్‌లో పార్టీ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఎన్ బాలమల్లేష్, కలవేణ శంకర్, ఎం బాలనరసింహాలతో కలిసి కూనంనేని సాంబశివరావు శనివారం మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ తప్పు చేసి ఉంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి తప్ప .. అలా చేయకుండా సాక్షాత్తు కేంద్ర మంత్రే రాహుల్ గాంధీ టెర్రరిస్టు అని ముద్ర వేస్తున్నారని కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు.



# ప్రభుత్వ ప్రాధాన్యతలు భేష్
## ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం
### సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబర్21:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి విషయంలో ప్రభుత్వ ప్రాధాన్యతలు బాగున్నాయని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. గత నెలలో వాషింగ్టన్‌లో ప్రంచబ్యాంక్ అధ్య క్షుడు అజయ్ బంగాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో తదుపరి చర్చల కోసం ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలో వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్‌పాల్ ప్రోసీ,అర్బన్ ఇన్‌ఫ్రా,ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కె.డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్‌రే శనివారం హైదరాబాద్ వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డితో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అబివృద్ధి, విద్యా,వైద్య,సాగునీటి రంగాలను తమ ప్రభుత్వ ప్రాధా న్యాలుగా పెట్టుకున్నామని,ఆయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి వివరించారు. విద్యా,వైద్య రంగాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనికత బాగుందని,భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని మార్టిన్ రైజర్ ప్రశంసించారు. సమావేశంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,ముఖ్యమంత్రి ప్రిన్సి పల్ సెక్రటరీ వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శులు సత్యనారాయణ,మాణిక్‌రాజ్, మున్సి పల్ ముఖ్యకా ర్యదర్శి దానకిశోర్, వైద్యా ఆరోగ్యశాఖ క్రిస్టియానాజోంగ్తూ,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గ్రీన్ ఫార్మాసిటీ రద్దుపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు
### హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసిన నవీన్ మిట్టల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబర్21:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లివద్ద గ్రీన్ ఫార్మాసిటీపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గ్రీన్‌ఫార్మాసిటీ రద్దు అనే మీడియా కథనాలు వాస్తవం కాదని కొనసాగుతుందని వెల్లడించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. రద్దుపై ప్రభుత్వం ఎలాంటి ఉత్త ర్వులు జారీ చేయలేదని స్పష్టం చేశారు.

## శ్రీనిధి మహిళా సహకార బ్యాంక్ ఎండిపై విచారణ కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని శ్రీ నిధి మహిళా సహకార పరపతి ఫెడరేషన్ ఎండిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర సర్కార్ విచారణకు ఆదేశిస్తూ అందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సహకార శాఖ అదనపురిజిస్ట్రార్ శ్రీనివాసరావు, ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ చంద్రకళ, ఐటీ శాఖ ఎజిఎం శ్రీనివాస్, పంచాయితీరాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉన్నారు. శ్రీ నిధి సహకార బ్యాంకులో నిబంధనలకు విరుద్ధంగా సిఎస్ఆర్ ఫండ్స్‌ను ఎండి జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గానికి మళ్లించారనే అవినీతి, ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఈ కమిటీ రెండు నెలల వ్యవధిలో విచారణ జరిపి పూర్తి నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

## పన్నుల వాటాలో రాష్ట్రానికి భారీ కోత

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన గ్రాంటుల్లో యేటా భారీగా కోత పడుతోంది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు రాష్ట్ర రెవెన్యూ రాబడులు 51 వేల కోట్ల రూపాయల్లో గ్రాంట్లు, పన్నుల వాటా తదితర వాటి కింద కేంద్రం నుండి 29.98 శాతం మేర 15,306 కోట్ల రూపాయలు సమకూరాయి. అదే 2022-23 వార్షిక సంవత్సరం పూర్తయ్యే సరికి ఆ ఏడాది రాష్ట్ర మొత్తం రెవెన్యూ రాబడులు 1,59,350 కోట్ల రూపాయల్లో 20.61 శాతం మేర 32,847 కోట్ల రూపాయల మేర పన్నుల్లో వాటా, గ్రాంట్లు, ఇతర వాటి కింద కేంద్రం నుండి వచ్చాయి. అదే 2023-24 ఆర్థిక సంవత్సరం వచ్చే సరికి కేంద్రం నుండి 41,259కోట్ల రూపాయల చొప్పున వస్తాయని అంచనా వేయగా, చివరకు బడ్జెట్ అంచనాల్లో 11 శాతం మేర 4,532 కోట్ల రూపాయలకు భారీగా కోత పడింది.

## డిఎవో.. జీఆర్‌ఎల్‌ను ప్రకటించిన టీజీపీఎస్‌సీ
### కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** డైరక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్‌లోని డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏవో) పోస్టులకి సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ లిస్టు(జీఆర్‌ఎల్)ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషనన(టీజీపీఎస్‌సీ) ప్రకటించింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల జీఆర్‌ఎల్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ ప్రకటించారు. అభ్యంతరాలను పరిశీలించిన కమిటీ శనివారం ఫైనల్ కీని ప్రకటించడమే కాకుండా జీఆర్‌ఎల్‌ను ప్రకటించింది టీజీపీఎస్‌సీ. ఫైనల్ కీపై ఎటువంటి అభ్యంతరాలను స్వీకరించేది లేదని కమిషన్ స్పష్టం చేసింది.

## కాంట్రాక్టర్లకు పనుల అప్పగింతలో పారదర్శకత ఉండాలి
### సర్కారుకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో చేబడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్న పనుల్లో అనేకచోట్ల పారదర్శకత వుండడం లేదని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆరోపించింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డికి శనివారం ఓ లేఖ రాశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు వుండాలి తప్పించి, కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చే విధంగా వుండకూడదన్నారు.

## రేషనలైజేషన్ జీవో 25 నిబంధనలను మార్చాలి
### ప్రభుత్వానికి యూపీఎస్‌సీ విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** తరగతి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండి విద్యార్థులను వారి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించవలసి ఉండగా.. అశాస్త్రీయమైన జీవో 25 అమలు చేయాలని పాఠశాల విద్య డైరక్టర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించడాన్ని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ తీవ్రంగా ఖండించింది. ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదలీల్లో పాఠశాల విద్యా శాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయకపోవడం పట్ల యూఎస్‌పీసీ ఆందోళన వ్యక్తం చేసింది. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియద్వారానైన బదలీ అయిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని సంఘం సభ్యులు కోరుతున్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి
### విశ్వహిందూ పరిషత్ డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** అమృతంగా భావించే తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ అధికార ప్రతినిధి డా.రావినూతల శశిధర్, ఏపీ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తదితరులు ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడి లడ్డూ ప్రసాదంలో మాటలకందని పాపం జరిగిందన్నారు.

# పగలు మండుటెండ..సాయంత్రం జోరువాన
### తెలంగాణ వ్యాప్తంగా అనూహ్య వాతావరణం
### భారీ వర్షానికి నదుల్లా మారిన 'గ్రేటర్' రహదారులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా రెండు నెలలుగా చోటుచేసుకున్న అనూహ్యావాతావరణం శాస్త్రవేత్తలకు సైతం అంతు చిక్కడం లేదు. పగటిపూట వేసవి కాలాన్ని తలపించే విధంగా ఎండలు సుర్రుమంటుండగా సాయంత్రంవేళ ఉన్నట్లుండి ఆకాశంలో మబ్బులుపట్టి గంటల వ్యవధిలోనే ఉరు ములు, మెరుపులు, పిడుగులతో 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం దంచికొడుతుండడంతో కాలనీలతోపాటు రహదారులు జలమయమవుతూ జన జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ తరహా వాతావరణంవల్ల హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంత వానలు పడడం గమనార్హం. శుక్రవారం సాయంత్రం వరకు జంట నగరాలు, శివార్లలో వేసవిని తలపించిన ఎండలు మండగా రాత్రి వేళ భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కురిసిన భారీ వర్షానికి గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థ కుదేలవగా, రహదారులు నదులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. గ్లోబల్ వార్మింగ్ గురించి రెండు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతుండడం తెలిసిందే. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం, శిలాజ ఇంధనాల వాడకం ఎక్కువవడం, అడవుల నరికివేత మితిమీరుతుండడం వల్ల వాతావరణంలో విపరీతమైన మార్పులు సంభవించడమే గ్లోబల్ వార్మింగ్. దీని ప్రభావం వల్లే భారత్‌లోని ముంబాయి సహా పలు నగరాలలో రుతుపవనాల సమయంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని వారంటున్నారు. అయితే ఈ జాబితాలో ఇప్పుడు దక్షిణాది రాష్ట్రమైన తెలంగాణ కూడా చేరిపోయింది. మూడేళ్ల క్రితం నగరంలోని మీర్‌పేట్ సహా కొన్నిచోట్ల 20నుంచి 30 సెంటీమీటర్ల వానలు పడగా తాజాగా ఖమ్మం, వరంగల్‌లలో ఇంతే స్థాయిలో వర్షాలు పడ్డాయి. తాజాగా సంగారెడ్డిలో శుక్రవారం, శనివారం రాత్రి గ్రేటర్ పరిధిలో వానలు దంచి కొట్టాయి. ఉమ్మడి ఎపిలో 2009లో ఒకసారి కర్నూలుతో పాటు కర్ణాటకలోని కొన్నిచోట్ల ఇలాగే జరగడంతో వానలు భారీగా పడి శ్రీశైలం ప్రాజెక్టు వరదగేట్లను దాటి పది అడుగుల పైనుంచి వరదనీరు వెళ్లింది. శుక్ర, శనివారాల్లో జంట నగరాలు, శివార్లలో కురిసిన భారీ వర్షాలు ఈ కోవకే చెందుతాయి. పిడుగుల ధాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఒక్క ఏడాదే 50 మంది వరకు మరణించగా వందల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఇదిలావుండగా శుక్రవారం రాత్రి, శనివారం సాయంత్రం వేళలో గ్రేటర్ పరిధిలో కురిసిన భారీ వర్షం నగరంపై తీవ్ర ప్రభావం చూపింది. జనజీవనం కుదేలయ్యింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై చేరిన వరదనీటిని తొలగించేందుకు బల్దియాతో పాటు పోలీసు, అగ్నిమాపక విభాగం రంగంలో దిగి పరిస్థితు లను చక్కదిద్దేందుకు చర్యలు చేబట్టింది. కాగా గ్రేటర్ పరిధిలో మరో రెండు రోజుల పాటు వానలు కురిసే వీలుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు.

## మూసీ ప్రక్షాళనకు రెడీ..!
### బాధితులకు డబుల్ బెడ్‌రూం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు
### రంగంలోకి దిగనున్న హైడ్రా
### పరీవాహక ప్రాంతాల్లో కూల్చివేతలకు సన్నాహాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త:** మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఆక్రమణలను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే సర్వే నిర్వహించిన అధికారులు సుమారు 12వేల ఆక్రమణలు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈనేపథ్యంలో తొలివిడతగా నది గర్భంలోని ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించి ఆబాధ్యతలను హైడ్రాకు అప్పగించినట్లు తెలుస్తుంది. ఈమేరకు శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు ప్రాంతాల్లో పర్యటించి మూసి పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి కూల్చివేతల సమయంలో ఇళ్లు కోల్పోతే వారికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూసీ సుందరీకరణపై సిఎం రేవంత్‌రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని ఈప్రాంతాల్లో పర్యాటక, పారిశ్రామిక, ఉపాధి అవకాశాలు పెంచేవిధగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాగా గడిచిన కొన్నేళ్లుగా మూసీ కెనాల్‌కు ఇరువైపులా అక్రమ కట్టడాలు భారీగా వెలిశాయి. కాలువను కుదించి మరీ కట్టడాలు జరిపారు. పెద్దపెద్ద భవనాలు సైతంనిర్మించారు. ఈనేపథ్యంలోనే సిఎం ఆదేశాలమేరకు గతకొద్దిరోజులుగా రెవెన్యూ అధికారులు పలుప్రాంతాల్లో సర్వే చేసిమూసీలోని ఆక్రమణలనుగుర్తించారు. దీంతో మూసిపరివాహక ప్రాం తాల్లో హైడ్రాఎలాంటి చర్యలు తీసుకుంటుందనేదానిపై సర్వత్రాఆసక్తి నెలకొంది.

# బిసి మహిళలకు వాటాలేని బిల్లును అంగీకరించం
### రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



శనివారం ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న చిరంజీవులు, వకులాభరణ కృష్ణమోహన్,బండా ప్రకాశ్ ,మణిమంజరి, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** దేశప్రధానిగా బిసిసామాజిక వర్గానికి చెందిన నరేంద్రమోదీ ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా బిసిలకు చారిత్రాత్మకంగా అన్యాయం జరుగుతుందని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్‌కోటా -భవిష్యత్ కార్యాచరణపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దీనికి శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి సంక్షేమసంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకలాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు గడుస్తున్నా చట్టసభలు అగ్రవర్ణాలకు చుట్టసభలుగా మారాయని, దేశజనాభాలో 60శాతంపైగా ఉన్న బిసిలకు 18శాతమే ప్రాతినిధ్యం దక్కిందన్నారు. ఇందులో 30శాతం ఉన్న బిసిమహిళలకు రెండుశాతమే ఉండటం విచారకరమన్నారు. కానీ పిడికెడు శాతం ఉన్న అగ్రవర్ణాలకు మాత్రం 90శాతం ప్రాతినిధ్యం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వల్ల బిసిమహిళలకు ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేదని నల్లదొరల స్థానంలో నల్లదొరసానులు అసెంబ్లీ, పార్లమెంట్‌లో అడుగు పెడతారే తప్పా ఉత్పత్తి చేసే శ్రామిక బిసి మహిళలను చట్టసబలకు ఆమడ దూరంలో అన్ని రాజకీయ పార్టీలు ఉంచుతున్నాయన్నారు. పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఉన్న 26రాజకీయ పార్టీలు మహిళా బిల్లులో బిసిమహిళలకు సబ్‌కోటా కావాలని గట్టిగా నిలదీయలేకపోయారని ఇది చాలా దారుణమన్నారు. మహిళా బిల్లులో బిసిమహిళలకు సబ్‌కోటా దక్కడానికి దసరా తర్వాత రాష్ట్రంలో 1000మంది మహిళా ప్రజాప్రతినిధులతో బిసి మహిళా రాజకీయ ప్లీనరీ నిర్వహిస్తామని ,డిసెంబర్‌లో వేలాదిమంది మహిళలతో మహిళా గర్జన సభ ఏర్పాటు చేయడంతోపాటు ఫిబ్రవరిలో లక్షలాది మంది మహిళలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని పేర్కొన్నారు. మహిళా సంఘం అధ్యక్షురాలు మణిమంజరి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో డిఎస్పీ పార్టీ అధ్యక్షులు విశారదన్ మహారాజ్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయ కురాలు ఇందిరా శోభన్, కుందారం గణేష్‌చారి, బాలరాజ్‌గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రంగౌడ్, శ్యాంకురుమ తదితరులు పాల్గొన్నారు.

# స్కిల్ వర్సిటీ పరిధిలోకి ఐటిఐ, ఎటిసి, పాలిటెక్నిక్‌లు
### కార్మిక,ఉపాధి కల్పన శాఖ అధికారులతో సిఎం రేవంత్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబర్21:** మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటిఐ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఆయా కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు ఓ కమిటీని నియమించి,నిపుణులు,విద్యావేత్తలు సలహాలు,సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మిక,ఉపాధి కల్పన శాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఐటిఐలను అడ్వాన్స్‌డ్, టెక్నాలజీ సెంటర్స్‌గా మారుస్తున్న నేపథ్యంలో సిబ్బంది కొరత లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుత ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రతి ఐటిఐ కాలేజీఆలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చూడాలని,శిక్షణ తీసుకుంటున్న వారికి సమగ్రమైన శిక్షణ అందేలా జాగ్రత్త పడాలని సూచించారు. ఐటిఐ కాలేజీల పర్యవేక్షణ,తనిఖీలు క్రమం తప్పకుండా చేపట్టాలని సిఎం అధికారలను ఆదేశించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో ఐటిఐ,ఏటీసీ లేని అసెంబ్లీ నియోజకవర్గాలను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను సిఎం ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా 100 నియోజకవర్గాలలో ఐటిఐ,ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఐటిఐ,ఏటీసీ, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధివిధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారలను ఆదేశించారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. కాగా, ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్,ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, టిజిఐఐసి ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ రాక
### పర్యటన సందర్భంగా భారీ ఏర్పాట్లు: శాంతికుమారి

**హైదరాబాద్, సెప్టెంబరు 21 ప్రభాతవార్త:** రాష్ట్రానికి ఈనెల 28న రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులను అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి ఒకరోజు పర్యటన సందర్భంగా రాష్ట్రపతి ఉదయం నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి హాజరవు తారని తెలిపారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో డిజిపి జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డిజి ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రావెంకటేశం, అటవీశాఖ కార్యదర్శి అహ్మద్ నదీమ్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్‌రావు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, సమాచార పౌరసరంబంధాల స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రాపాలి, సిఎండి టిఎస్‌పిడిసిఎల్ ముషారఫ్ అలీలు పాల్గొన్నారు.

## 'మల్లన్న' సాగర్ నీళ్లు ఎల్లంపల్లివే
### కాళేశ్వరం పెట్టుబడి నిష్ప్రయోజనం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త:** మల్లన్నసాగర్ నింపిన నీళ్ళకు కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ నీళ్ళకు ఏలాంటి సంబంధంలేదని ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులను నీటితో నింపామని తెలంగాణ రాష్ట్ర రవాణా బిసి సంక్షేమసంఘం మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు మీరు అధికారంలో ఉండగానే కుంగిపోయిందని దానిలోనీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని జాతీయ ఆనకట్టల భద్రతా ప్రాదికారసంస్థ హెచ్చరికలతో నీటిని కిందికి వదిలిపెడుతున్నామని ఆయన గుర్తుచేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపేరు మీద పెట్టిన పెట్టుబడి మీరు అధికారంలో ఉన్నప్పుడు నిష్ప్రయోజనమైందని మల్లన్నసాగర్‌కు వచ్చిన నీళ్ళు కాళేశ్వరం నీళ్ళని మంత్రి హారీష్‌రావు అబద్దాలు చెప్పడం బాధకరం అని ఆయన అన్నారు. ఎల్లంపల్లి కాంగ్రెస్ హయాంలో పూర్తిచేశారని దీనికి బిఆర్‌ఎస్‌కు ఏలాంటి సంబంధంలేదని అన్నారు.

## తోట చంద్రశేఖర్‌పై సిసిఎస్‌లో కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** రియల్టర్, బిఆర్‌ఎస్ నేత అయిన తోట చంద్రశేఖర్‌పై సిసిఎస్ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. తోట చంద్రశేఖర్ తన వద్ద నుంచి 50 కోట్ల రూపాయలు తీసుకుని నిండాముంచాడని వాకాడ తిరుమలరావు అనే వ్యక్తి శనివారం సిసిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. 50కోట్ల రూపాయలతో హైదరాబాద్ శివార్లలో 220ప్లాట్లు నిర్మించేలా ఆదిత్యా, తిరుమల కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయని, అయితే నిబంధనల మేరకు పనులు జరగ లేదని. దీనివల్ల తనకు 29కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని తిరుమలరావు ఫిర్యాదు చేశాడు. మొత్తం ఆరుగురు నిందితులపై కేసులు నమోదు కాగా ఇందులో తోట చంద్రశేఖర్ ఎ3గా వున్నాడు.

## విదేశాల్లో ఎల్ఐసీ సేవలకై ఫారిన్ యూనిట్ల కాన్ఫరెన్స్

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఎల్ఐసీ తన సేవలను ఇతర దేశాల్లో అందించేందుకు గాను విస్తరణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా యుకే, సింగపూర్, బెహ్రెన్, కిన్యా, ఫిజీ, మారిటస్, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల యూనిట్లతో ఎల్ఐసీ శుక్రవారం కాన్ఫరెన్స్‌ను నిర్వహించింది. ఇతర దేశాల్లో బీమా సేవలు అందించేందుకు గాను తాజాగా ఐఎఫ్‌ఎస్‌సిఎ ప్రూవల్‌ను కూడా తీసుకుంది. ఎల్ఐసీ గిఫ్ట్ సిటీ నగరాల్లో వివిధ రకాల ప్రయోజనాలను అందించడం ద్వారా కార్యకలాపాలను ప్రారంభించే అవకాశాలను అన్వేషిస్తున్నట్లు ఒక ప్రకటనలో జీవిత బీమా సంస్థ తెలిపింది. ఈ కాన్ఫరెన్స్‌లో ఎల్ఐసీ సిఇఒ సిద్ధార్థ మొహంతి, ఎండి జగన్నాద్, టేబుల్ష్ పాండే, సత్‌పాల్ భానూ, దొరైస్వామి తదితరులు పాల్గొన్నారు.



శనివారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న పొట్టి శ్రీరాములు మనుమరాలు ప్రొఫెసర్ రేవతి , మలిపెద్ది శంకర్ తదితరులు

## తెలుగు వర్సిటీకి పొట్టిశ్రీరాములు పేరు కొనసాగించాలి
### తెలంగాణ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని తెలంగాణ ఆర్యవైశ్య అఫిసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం సోమా జిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షులు మలిపెద్ది శంకర్, పొట్టి శ్రీరాములు మనమరాళ్లు ప్రొఫెసర్ రేవతి, అనురాధ, మునిమనుమరాలు కుంద ప్రతిభ తదితరులు హాజరై మాట్లా డారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం ఆయన్ను అవమానించడమేనన్నారు. మద్రాస్ కేంద్రంగా ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించినప్పటికీ తమిళనాడు ప్రభుత్వం ఆయన స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆయన్ను అవమానించడం ఏంటని ప్రశ్నించారు. సురవరం ప్రతాపరెడ్డి అంటే తమకుకూడా గౌర వమేనని రాష్ట్రంలో అనేకవ్యవస్థలకు ఆయన పేరుపెట్టుకునే అవకాశం ఉం దన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం పురాలోచనచేయాలని లేనిపక్షంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వైశ్యవికాసవేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ, ఉప్పల వెంకటేష్, ప్రేమ్‌గాంధీ, దయాకర్‌రావు, నమశివాయ, నాగరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేరుశెనగ విత్తుల కోసం రైతు పాట్లు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** వేరుశెనగ విత్తుల కోసం రైతులు పడరాని పాట్లు పడతున్నారు. వేరుశెనగ విత్తనాలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేయడంతో ఒక్కసారిగా విత్తన ధరలు భారీగా పెరిగాయి. నాణ్య మైన విత్తనాలు క్వింటాలు 12వేల రూపాయల నుండి 15 వేలవరకూ ధర పలుకుతోంది. గతంలో ప్రభుత్వాలు సబ్సిడీ ఇవ్వడంతో క్వింటాల్ వేరుశెనగ విత్తనం 7వేల నుండి 8 వేల రూపాయల వరకూ ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో విత్తనాల కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వస్తోందని పలువురు రైతులు వాపోతున్నారు.



## అంధుల కోసం ఎస్‌బిఐ విరాళం

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమాజ సంక్షేమ కార్యక్రమాలను బలోపేతం చేసే ప్రయత్నాం చేస్తోంది. ఇందులో భాగంగా ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ సెట్టి హైదరాబాద్‌లో జోనల్ కార్యలయం పరిధిలో శనివారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. అంధుల సంక్షేమం కోసం దాన్ని నిర్వహిస్తున్న దేవనార్ పౌండేషన్‌కు విరాళం అందచేశారు. మదర్ నేచర్ రక్షణ పట్ల బ్యాంక్ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఎస్‌బిఐ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ ఏక్ పెడ్ మా కే నామ్‌ను ప్రారంభించారు. నిరుపేద ప్రజల అభ్యున్నతి కింద ఎస్‌బిఐ ఆల్ ఇండియా లేడీస్ క్లబ్ ప్రసిడెంట్ శ్రీదేవి సూర్య సమకూర్చిన సాయాన్ని సెట్టి చేతుల మీదుగా విరాళం అందించారు. సాయ సేవా సంఘానికి అవసరమైన వస్తువులు, దేవనార్ పౌండేషన్‌కు 51 లక్షల రూపాయల విరాళంగా అందచేశారు. అంతేకాకుండా అగ్నిమాపక వ్యవస్థ, రూఫ్‌టాప్ సోలార్, ఫొటో వోల్టాయిక్ సిస్టమ్ తదితర వాటిని సమ కూర్చారు. సిఎస్ఆర్ కింద ఏక్ పెద్ మా కే నామ్ ప్రారంభోత్సవం జరిగింది. ప్రకృతిని కాపాడేందుకు, కాలుష్య నియంత్రణకు మొక్కల పెంకాన్ని చేపట్టేందుకు ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ విధంగా ఈ ఏడాది 1.8 మిలియన్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. లేడీస్ క్లబ్ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థకు వాటర్ డిస్పెన్సర్, కుట్టు మిషన్లు అందచేశారు.

## అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదు
### ఎస్పీడీసీఎల్ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలో రికార్డులు స్థాయిలో అత్యధిక విద్యుత్ డిమాండ్ నమోదైంది. అత్యధికంగా 9910 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడిందని ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10.35 గంటలకు 9,910 మెగావాట్ల విద్యుత్ వినియోగించడం జరిగిందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి ఎస్పీడీసీఎల్ పరిధిలో 9862 మెగావాట్లు అత్యధిక డిమాండ్ రికార్డయిందని చెప్పారు. ఈ వారంలో సరాసరి విద్యుత్ డిమాండ్ 9317 మెగావాట్లతో సరాసరి వినియోగం 190.29 మిలియన్ యూనిట్లు ఉండగా, గత ఏడాది 9138 మెగావాట్లుతో, 182.11 మిలియన్ యూనిట్లుగా ఉందని వెల్లడించారు. ఈ సీజనులో భారీగా వర్షాలు పడటం, నీటి లభ్యత పెరగడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వ్యవసాయం రంగంలో డిమాండ్ భారీగా పెరుగుతోందని వివరించారు. ఈ నేపథ్యంలోనే ఈ సీజన్లో అత్యధిక డిమాండ్ 10000 మెగావాట్లను కూడా దాటే అవకాశం ఉందని తెలిపారు. అయితే డిమాండ్ ఎంత పెరిగినా అందుకు తగినట్లుగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.

## దసరాకు రైతు భరోసా..కౌలు రైతులకు కష్టమే

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** వచ్చే దసరా నాటకి రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రాష్ట్ర సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు అక్టోబరు 12న దసరా రోజునే రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ఆలోచనచేస్తున్నట్లు సమాచారం. దీనికి గాను ఇప్పటికే వ్యవసాయ శాఖ దాదాపు మార్గదర్శకాలను రూపొందించగా, ఆర్థిక శాఖ నిధులను సమీకరించే పనిలో నిమగ్నమైంది. రైతు భరోసా ఆర్థిక సహాయాన్ని అర్హులైన రైతులకు మాత్రమే అందించనుంది. కౌలు రైతులకు లేదా, సంబంధిత భూమి యజమాని ఎవరికో ఒక్కరికే రైతు బంధును వర్తింప చేయనుంది. ఎవరికి ఇవ్వాలనేది వారిద్దరూ ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది.

## విద్యుత్ ఉత్పత్తిలో రికార్డు సృష్టించిన కెటిపిపి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** విద్యుత్ ఉత్పత్తి చేయడంలో తెలంగాణకు చెందిన కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కెటిపిపి) సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ థర్మల్ పవర్ ప్లాంట్ 202 రోజులు నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని సాధించి కీలక మైలు రాయిని అధిగమించింది. ఇందులో మొదటి యూనిట్ 500మెగావాట్ల సామర్థ్యం, రెండో యూనిట్ 600 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఈ 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ 2023 డిసెంబరు 15 నుండి జూలై 4వ తేదీ వరకూ నిరంతరాయంగా 202 రోజులు నడిచి 85.36 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పిఎల్ఎఫ్) సాధించింది. ఇదే సమయంలో 2460.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. దీంతో కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ ప్రభుత్వ రంగ విద్యుత్ కేంద్రాల్లో 600 మెగావాట్ల విభాగంలో దేశంలోనే ఎక్కువ రోజుల పాటుగా నడిచిన యూనిట్‌గా నిలిచింది.

## పది లక్షల టన్నుల బియ్యం కావాలని కోరిన ఫిలిప్పీన్స్

**హైదరాబాద్, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త:** ఫిలిప్పీన్స్‌దేశం తెలంగాణలో అత్యధికంగా పండించే ఎంటియు 1010 రకం బియ్యం పదిలక్షలు టన్నులు తక్షణం సరఫరాచేయాలని కోరింది. బియ్యం విక్రయం నిర్ణయం ప్రభుత్వం తీసుకొంటుందని పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ రాజిరెడ్డి తెలిపారు. బిపిటి, సన్నరకం బియ్యం కూడా నిల్వలు ఉంటే పంపాలని ఫిలిప్పీన్స్ కోరింది. ఈమేరకు పౌరసరఫరాల కమీషనర్‌ను కలిసి పదిలక్షల టన్నుల మేరకు బియ్యం అవసరం ఉందని ఆదేశం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# బంగ్లాపై పట్టు బిగిస్తున్న భారత్




## మూడో రోజు టెస్ట్‌కు 356 రన్స్ ఆధిక్యం

**న్యూఢిల్లీ:** బాంగ్లాదేశ్ జట్టుపై స్వంత గడ్డ మీద టీమిండియా పట్టు బిగుస్తోంది. భారత్-బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న టెస్టు మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసింది. చెన్నై వేదిక జరుగుతున్న ఈ టెస్టు మ్యాచ్ మూడో రోజు శనివారం ఆట ముగిసే సరికి టీమిండియా ఇంకా 356 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. 515 పరుగుల భారీ లక్ష్యంతో సెకండ్ ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ జట్టు శనివారం ఆట ముగిసేటప్పటికి 4 వికెట్ల నష్టంతో 158 పరుగులుతో నిలిచింది. నజ్ముల్ షాంటో 51 పరుగులతోను, షకిబ్ అల్ హసన్ 5 పరుగులతో క్రీజులో ఉన్నాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన బంగ్లా ఇన్నింగ్స్‌ను ధీటుగా ఆరంభించింది. ఓపెనర్లు జకీర్ హసన్ 33 పరుగులు, షాద్‌మన్ ఇస్లామ్ 35 పరుగులతో 16 ఓవర్లలోనే స్కోరును 60 దాటించారు. ఈ దశలో ఫేస్ స్టార్ బుమ్రా టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. 16.2 ఓవర్ వద్ద జకీర్‌ను ఔట్ చేశాడు. డిఫెన్స్ ఆడోతే స్లిప్‌లోకి వెళ్లిన బంతి జైస్వాల్ అద్భుతంగా క్యాచ్ పట్టుకున్నాడు. ఇక మరో ఓపెనర్ ఇస్లామ్‌ను అశ్విన్ పెవిలియన్ పంపాడు. మోమినుల్ హక్ 13 పరుగులు, ముష్ఫికర్ రహీమ్ 13 పరుగులు చేసేటప్పటకి ఈ ఇద్దర్నీ అశ్విన్ క్రీజులో కుదురుకోకముందే ఔట్ చేశాడు. మొత్తంగా స్పిన్ మాంత్రికుడు రవిచంద్రన్ అశ్విన్ 3 వికెట్లు, పేసర్ జస్ప్రిత్ బుమ్రా 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకు ముందు సెకండ్ ఇన్నింగ్స్‌లో టీమిండియా ఓవర్‌నైట్‌స్కోర్ 3 వికెట్ల నష్టానికి 81 పరుగులుతో బ్యాటింగ్ కొనసాగించింది. యంగ్ బ్యాటర్లు తొలి సెషన్ నుంచే ఎటాకింగ్ గేమ్ ఆడారు. ఫలితంగా స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ 119 పరుగులతో సెంచరీ సాధించగా, రిషబ్ పంత్ 109 పరులు చేసి శతకాలతో ఇరువురు అదరగొట్టారు. సెంచరీ తర్వాత పంత్ క్యాచౌట్‌గా వెనుదిరిగాడు. అలాగే కేఎల్ రాహుల్ 22 పరుగులు చేశాడు. ఇక 4 వికెట్ల నష్టానికి 287 పరుగుల వద్ద టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మిరాజ్ 2 వికెట్లు, నహిద్ రానా, తస్కిన్ అహ్మద్ తలో వికెట్ దక్కించుకున్నారు.



## న్యూజిలాండ్, శ్రీలంక మధ్య..
# తొలి టెస్ట్ మ్యాచ్‌కు బ్రేక్

**న్యూఢిల్లీ:** శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌కు బ్రేక్ పడింది. తొలి మూడు రోజులు ఈ మ్యాచ్‌లు జరగ్గా, నాలుగో రోజు ఈ ఇరు జట్లకు విశ్రాంతినిచ్చారు. దేశంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతున్న కారణంగా శనివారం నాడు జరగాల్సిన నాల్గవ రోజు మ్యాచ్ జరగకుండా వాయిదా పడింది. ఈ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ ఈ నెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకూ జరుగుతుందని శ్రీలంక క్రికెట్ బోర్డు ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. ఇందులో బాగంగా తొలి మూడు రోజల పాటు న్యూజిలాండ్, శ్రీలంక జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. తదుపరి మ్యాచ్ 21వ తేదీన జరగాల్సి ఉండగా, దానికి బ్రేక్ వేసింది. ఆ తర్వాత 22, 23 తేదీల్లో యదావిధిగా మ్యాచ్‌లు కొనసాగనున్నాయి. ఇక రెండో టెస్టు ఐదు రోజుల్లోనే జరుగుతుంది. చివరిదైన రెండో టెస్టు ఈ నెల 26వ తేదీన ప్రారంభం కానుంది. ఈ టెస్టు మ్యాచ్ విషయానికి వస్తే మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 305 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది. రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 237 పరుగల వద్ద ఈ నెల 22వ తేదీన బ్యాటింగ్ కొనసాగిస్తుంది. ప్రస్తుతం శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 202 పరుగుల ఆధిక్యంలో ఉంది. కాగా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) నిర్వహిస్తున్న వరల్డ్ ఛాంపియన్ షిప్-2024లో భాగంగా న్యూజిలాండ్, శ్రీలంక జట్లకు ప్రస్తుతం ఈ సిరీస్ కీలకంగా మారనుంది. టెస్టు మ్యాచ్ ఆరు రోజులు జరగడం ఇదేతొలిసారి కాదు. ఇంగ్లండ్‌లో అనేక మ్యాచ్‌లు ఆరు రోజుల పాటు జరిగాయి.

## చైనా వరల్డ్ టూర్ క్వార్టర్ ఫైనల్లో మాళవిక ఓటమి




**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ పోరాటం ముగిసింది. మహిళల విభాగంలో ముందంజ వేసిన ఏకైక భారత్ ఆశాకిరణం యువ షట్లర్ మాళవిక బన్సోద్‌కు క్వార్టర్ ఫైనల్స్‌ల్లో చుక్కెదురైంది. జపాన్ స్టార్, నాల్గో సీడ్ ఆకానె యామిగుచి ధాటికి మాళవిక నిలువలేకపోయింది. చాంగ్జౌలో జరిగిన మహిళ సింగిల్స్ క్వార్టర్స్ ఫైనల్లో మాళవిక 10-21, 16-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ యామగుచి జోరుకు వరుస గేమ్‌లలో పరాజయం పాలైంది. బన్సోద్‌పై యామగుచికి వరుసగా ఇది మూడో విజయం కావడం గమనార్హం. ఈ టోర్నీలో మిగిలిన భారత్ షట్లర్లు తొలి దశలోనే ఇంటిదారి పట్టారు. ఇక పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్, మహిళల ఈవెంట్‌లో ఆకర్షి కశ్యప్, సామియా ఇమాద్‌లు తొలి రౌండ్ పోటీల్లోనే చైనా ఓపెన్ వరల్డ్ టూర్ టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. అలాగే మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి-సుమితన జోడీలు కూడా తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయారు. కేవలం మాళిక మాత్రమే పలు దశలను అధిక మించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరినా చివరకు ఓటమి పాలైంది.

## చెస్ ఒలింపియాడ్‌లో భారత్‌కు అన్నీ డ్రాలే
### అజేయంగా పురుషుల జట్టు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత్ పురుషుల జట్టు అజేయంగా సాగుతోంది. ఉజ్బెకిస్తాన్‌తో జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను భారత్ పురుషుల జట్టు 2-2తో టై చేసుకుంది. ఈ పోరులో బరిలోకి దిగిన నలుగురు ఆటగాళ్లుకూడా తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. ఈ టోర్నీమెంట్‌లో వరుసగా ఎదురులేని విజయాలతో దూసుకువెళుతున్న భారత్‌ను నిలువరించిన జట్లుగా ఉజ్బెకిస్తాన్ నిలిచింది. దొమ్మరాజు గుకేశ్, నొదిర్బెక్ అబ్దుసత్తొరోవ్‌తోను, ప్రజ్ఞానంద జవొచిర్ సిందరొవ్‌తోను, విదిత్ గుజరాతి జకొంగిర్ వదోవ్‌తోను, ఇరిగేశి అర్జున్ షంసిద్దిన్‌తోను తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు. 9 రౌండ్లు ముగిసే సరికి భారత్ 17 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. కాగా మహిళల విభాగంలో తొమ్మిదో రౌండ్‌లో భారత్ బృందం 2-2తో అమెరికా జట్టుతో టై చేసుకుంది. మూడు మ్యాచ్‌లు ముగిసిన తర్వాత 2-1తో అమెరికా ఆధిక్యంలో నిలిచింది. ఈ దశలో వంతిక అగర్వాల్ వేసినఎత్తులు భారత్‌ను పై ఎత్తుకు చేర్చింది. తప్పక గెలవాల్సిన నాలుగో మ్యాచ్‌లో ఆమె ఇరినా క్రెశ్‌ను ఓడించి 2-2తో స్కోరును సమం చేసుకోవడంతో భారత్ మహిళల జట్టు ఊపిరి పీల్చుకుంది.

# తొలి వన్డే సిరీస్ అఫ్ఘాన్ కైవసం




## దక్షిణాఫ్రికాపై 2-0తో క్లీన్‌స్వీప్

**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్థాన్ జట్టు చరిత్ర సృష్టించింది. అద్భుతమైన ప్రదర్శనతో అగ్రశ్రేణి జట్టు దక్షిణాఫ్రికాకు అనూహ్య రీతిలో షాక్ ఇచ్చింది. దక్షిణాఫ్రికా జట్టుపై వరుసగా రెండో వన్డేలోనూ విజయం సాధించింది. షార్జా వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇంకో వన్డే మిగిలి ఉండగానే ప్రత్యర్థి జట్టుపై 2-0తో అఫ్ఘాన్ సిరీస్‌ను కైవసం చేసుకుంది. దీంతో తొలిసారి ఆ జట్టు వన్డే సిరీస్‌ను దక్కించుకున్నట్లైంది. ఇక అఫ్ఘాన్ ప్లేయర్లు బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అద్భుత ప్రదర్శన చేశారు. దీంతో 177 పరుగుల తేడాతో సఫారీ జట్టు ఓటమిని చవిచూసింది. షార్జాలో జరిగిన రెండో వన్డేలో టాస్ గెలిచిన అఫ్ఘాన్ మొదట బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 311 పరుగులు చేసింది. ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ 105 పరుగులు చేసి సెంచరీతో ఆకట్టుకున్నాడు. అజ్మతుల్లా ఓమర్ జాయ్ 86 పరుగులు, రహ్మత్ షా 50 పరుగులతో రాణించారు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ భారీ స్కోర్ చేయగలిగింది. అనంతరం 312 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ప్రారంభంలోనే వరుసగా వికెట్లను కోల్పోయింది. నిర్ణీత 34.2 ఓవర్లలో కేవలం 134 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా తరపున కెప్టెన్ టెంబ బావుమా ఒక్కడే 38 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు. ఆఫ్గనిస్థాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 5 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేశాడు. ఖరోటే 4 వికెట్లతో రాణించాడు. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించిన రషీద్ ఖాన్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇక దక్షిణాఫ్రికాతో మొదటి మ్యాచ్‌కు దూరమైన ఆఫ్గనిస్థాన్ స్టార్ ప్లేయర్ రషీద్ ఖాన్ రెండో మ్యాచ్ బరిలోకి దిగి 5 వికెట్లు తీశాడు. ఇక మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చివరివన్డే షార్జావేదికగా ఆదివారం జరగనుంది.

# ఉల్లిపాయలు, బంగాళాదుంప ఉత్పత్తిలో క్షీణత

**ముంబై, సెప్టెంబరు 21:** భారతదేశంలో కీలక ప్రాంతాల్లో దిగుబడితగ్గడం వల్ల 2023-24లో ఉల్లిపాయల ఉత్పత్తి 19.76శాతం తగ్గి 24.24 మిలియన్ టన్నులకు, బంగాళాదుంప ఉత్పత్తి 5.13శాతం తగ్గి 57.05 మిలియన్ టన్నులకు చేరుకోనుందని ప్రభుత్వం శనివారం విడుదల చేసిన మూడవ ముందస్తు అంచనాల్లో వెల్లడైంది. అలాగే భారత ఉద్యానవన ఉత్పత్తి 2023-24లో స్వల్పంగా 0.65శాతం తగ్గి 353.19 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని డేటా తెలిపింది. అంతకుముందు జూన్ నెలలో విడుదల చేసిన 2023-24 రెండవ ముందస్తు అంచనా ప్రకారం మొత్తం ఉద్యాన పంటల ఉత్పత్తి 352.23 మిలియన్ టన్నులుగా అంచనా వేయగా, ఇప్పుడు స్వల్పంగా పెరిగింది. కూరగాయలైన వంకాయ, క్యాప్సికం ఉత్పత్తి కూడా తగ్గవచ్చు. వ్యక్తిగత పంట దిగుబడిలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, మొత్తం కూరగాయల ఉత్పత్తి 205.80 మిలియన్ టన్నుల వద్ద స్థిరంగా ఉంటుందని అంచనా. అయితే టమాటోలు, క్యాబేజీలు, క్యాలీ ఫ్లవర్, టాపియోకా, సీసా పొట్లకాయ, గుమ్మడి కాయ, క్యారెట్, దోసకాయ, చేదు పొట్లకాయ, పర్వాల్, ఓక్రా ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదలను ప్రభుత్వ డేటా అంచనా వేసింది. పండ్ల ఉత్పత్తి కూడా 2.29శాతం వృద్ధి చెందుతుందని తెలిపింది. మామిడి, అరటి



పండ్ల ఉత్పత్తి సానుకూలంగా ఉండగా, ఆపిల్స్, తీపి నారింజ, జామ, దానిమ్మ పండ్ల క్షీణించవచ్చునిఅంచనా. ఇంకా తేనె, పూలు, తోటల పంటలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కల ఉత్పత్తి గత సంవత్సరం తుది అంచనాల కంటే పెరుగుదలను నమోదు చేయవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది.

# ఇన్వెస్టర్లకు ఎల్ఐసి గుడ్‌న్యూస్..

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** ప్రస్తుతం మార్కెట్లలో పెట్టుబడి ట్రెండ్‌లను పరిశీలిస్తే, గడచిన కొన్నిత్రైమాసికాలుగా దేశంలో ప్రజలుతమ డబ్బును బ్యాంకుల్లో డిపాజిట్లుగా ఉండడం కంటే స్టాక్‌మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయడం ఉత్తమంగా భావిస్తున్నారు. ఈ క్రమంలో చాలా మంది నేరుగా పెట్టుబడుల కంటే మ్యూచువల్ ఫండ్లను ఆశ్రయిస్తు న్న విషయం విదితమే. దీంతో చిన్న ఇన్వెస్టర్లను కూడా భాగస్వాములుగా చేసుకునేందుకు మ్యూచువల్ ఫండ్ సంస్థలు కొత్త ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులను ఆకర్షించడానికి కనీస రోజువారీ సిప్ పెట్టుబడి పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.300ను రూ.100కి తగ్గించడాన్ని పరిశీలిస్తోంది. ఇదే క్రమంలో నెలవారీ కనీస సిప్ పెట్టుబడి మొత్తాన్ని రూ.వెయ్యి నుంచి రూ.200కి తగ్గించే ప్రణాళికలు ఉన్నాయి. వాస్తవానికి మైక్రో సిప్ ఇటీవల మార్కెట్లలో భారీగా గుర్తింపును పొందుతున్న విషయం విదితమే. దేశంలో ప్రతి చిన్న పెట్టుబడిదారుడికి కూడా మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులకు ప్రాప్యతను మెరుగుపరచడం లక్ష్యంగా తాజా మార్పులు వస్తున్నాయి. రానున్న మూడేళ్లలో కనీస సిప్ మొత్తాన్ని తగ్గించడం వల్ల ఎక్కువ సంఖ్యలో భాగస్వాములుగా మారుతారని అంచనా వేయబడుతోంది. దీనిపై ఎల్ఐసి మ్యూచువల్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ఆర్‌కె ఝా మాట్లాడుతూ ఎఎంసి రిజిస్ట్రార్ కె ఫిన్‌టెక్ సర్వీస్‌తో కలిసి పనిచేస్తోందన్నారు. అలాగే కనీస రోజువారీ, నెలవారీ సిప్ పరిమితిని రూ.100, రూ.200కి తగ్గించడానికి వచ్చే నెల ప్రారంభంలో అనుబంధాన్ని దాఖలు చేయనున్నట్లు ఆయనతెలిపారు. ఈ దశ ఈక్విటీ మార్కెట్ బూమ్ నుంచి ప్రయోజనం పొందని సమాజంలోని వర్గాలను చేరుకోవడానికి ఫండ్ హౌస్‌కి సహాయం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఫండ్ హౌస్ నిర్వహణ లో ఉన్న ఆస్తులను ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.35 వేల కోట్ల నుంచి రూ.65 వేల కోట్లకు, 2026 చివరినాటికి రూ.లక్ష కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకు న్నట్లు వెల్లడించారు. తాజా క్రెడిట్ డిఫాల్ట్ స్వాప్‌లు (సిడిఎస్) కొనుగోలు, అమ్మకం రెండింటికీ మ్యూచువల్ ఫండ్‌లను సెబి అనుమతించింది. కార్పొరేట్ బాండ్ మార్కెట్‌లో లిక్విడిటీని పెంచడం దీని లక్ష్యం. సిడిఎస్‌లో పాల్గొనేందుకు ఈ వెసులుబాటు మ్యూచువల్ ఫండ్స్‌కు అదనపు పెట్టుబడి ఉత్పత్తిగా ఉపయోగపడుతుందని సెబి సర్క్యులర్‌లో పేర్కొంది.




# వాణిజ్యం

# 10 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** భారతదేశ జిడిపి 2032 నాటికి 10 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి సిద్ధపడుతుందని ఐడిబిఐ కేపిటల్ తన నివేదికలో తెలిపింది. ఈ నివేదిక ప్రకారం దేశ జిడిపి ప్రతి 18 నెలలకు ఒక లక్ష కోట్ల డాలర్లు జోడించడానికి సిద్ధంగా ఉందని, ఇదే ఊపుతో 2023 నాటికి 10 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి అవకాశముంటుందని పేర్కొంది. మేక్ ఇన్ ఇండియా వంటి కీలక కార్యక్రమాలు దేశానికి సంబంధించిన తయారీ సామర్థ్యాలను పెంపొందించడమే కాకుండా భారత్‌ను 'గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్'గా ఉంచడంలో కీలకమైన పాత్ర పోషిస్తాయని నివేదిక పేర్కొంది. పారిశ్రామికోత్పత్తి సూచీలో అమెరికా, చైనా, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలను అధిగమించి తయారీ రంగలో అగ్రగామిగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను భారత్ అధిగమిస్తుందని నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం 2030 నాటికి జిడిపిలో 25శాతం ఎగుమతులు రెండు లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటాయని అంచనా వేసింది.




# రూ.3 వేల కోట్ల సమీకరణకు స్పైస్‌జెట్ ఆమోదం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** ప్రముఖ విమానయాన సంస్థ స్పైస్‌జెట్ నిధుల సమీకరణకు చేస్తున్న ప్రయత్నాల్లో ముందడుగుపడింది. అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలు దారుల నుంచి రూ.3వేల కోట్ల నిధులను సేకరించడానికి ఒక్కో షేరుకు రూ.61.60 ఇష్యూ ధరతో 48.7 కోట్ల ఈక్విటీ షేర్లను జారీచేయడానికి స్పైస్‌జెట్ బోర్డు తాజాగా ఆమోదం తెలిపింది. ఈ సంస్థాగత పెట్టుబడిదారుల్లో సొసైటీ జెనరలే, మోర్గాన్ స్టాన్లీ ఆసియా, ఐటిఐ ఫండ్స్, గోల్డ్‌మన్ శాచ్, బిఎన్‌పి పారిబాస్, నోమురా సింగపూర్, జూపిటర్ గ్లోబల్ ఫండ్, టాటా మ్యూచువల్ ఫండ్, బంధన్ మ్యూచువల్ ఫండ్, 360 వన్, కాప్రి గ్లోబల్, వైట్ ఓక్, బోఫా సెక్యూరిటీస్ ఉన్నాయి. ఇలా సేకరించిన నిధులను కంపెనీ రుణాలు తీర్చడానికి, ఇతర అభివృద్ధి పనుల కోసం ఉపయోగించనుంది. సెప్టెంబర్ 15 నాటికి స్పైస్‌జెట్‌కు చట్టబద్ధమైన బకాయిలు రూ.601.5 కోట్లుగా ఉన్నాయి. ఈ మొత్తంలో రూ.297.5 కోట్లు మూలాధారం వద్ద పన్ను మినహాయించబడిన డిపాజిట్, రూ.156.4 కోట్లు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్‌కు సంబంధించినవి, రూ.145.1 కోట్లు వస్తు సేవల పన్నుకి సంబంధించినవి ఉన్నాయి. విమానయాన రంగంలో సవాళ్లతో కూడిన మార్కెట్ పరిస్థితుల మధ్య సజావుగా కార్యకలాపాలు సాగించేందుకు స్పైస్‌జెట్ ప్రయత్నాలు చేస్తుంది.





# అమెరికాలోనూ ఓయో సేవలు..

**ముంబై, సెప్టెంబర్ 21:** ప్రముఖ హాస్పిటాలిటీచైన్, దేశీయ యూనికార్న్ సంస్థ ఓయో అమెరికాలో తన కార్యకలాపాలను విస్తరించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ప్రముఖ లాడ్జింగ్ ఫ్రాంచైజీ, మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్లను నడుపుతున్న జీ6 హాస్పిటాలిటీ సంస్థను కొనుగోలు చేయనుంది. బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ కంపెనీ నుంచి 525 మిలియన్ డాలర్లకు దీన్ని కొనుగోలు చేయనున్నట్లు ఓయో మాతృ సంస్థ శనివారం ప్రకటించింది. పూర్తి నగదు రూపంలో ఈ లావాదేవీ జరగనుంది. భారత్‌లోని ప్రధాన నగరాల్లో సేవలందిస్తున్న ఓయో, అమెరికాలో 2019లో అడుగుపెట్టింది. ప్రస్తుతం 35 రాష్ట్రాల్లో 320కిపైగా హోటళ్లను నిర్వహిస్తోంది. గతేడాది 100 హోటళ్లను చేర్చుకుంది. ఈ యేడాది మరో 250 హోటళ్లను తన పోర్ట్‌ఫోలియోలో చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మోటల్ 6, స్టూడియో 6 బ్రాండ్ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఓయో ప్రకటించడం విశేషం. 2024 నాలుగో త్రైమాసికానికి కొనుగోలు పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు ఓయో తెలిపింది. అంతర్జాతీయంగా ఓ స్టార్టప్ తన ఉనికి చాటుకోవడంలో ఈ కొనుగోలు కీలక మైలురాయిగా నిలుస్తుందని ఓయో ఇంటర్నేషనల్ సిఇఒ గౌతమ్ స్వరూప్ ఈ సందర్భంగా తెలిపారు. మోటల్ 6కు అమెరికాలో మంచి గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఓయోకున్న ఈ అనుభవంతో మరింత వృద్ధి సాధిస్తామని, వేరే సంస్థగానే దీన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. మోటల్ 6 బ్రాండ్‌లో బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ సంస్థ పెద్ద మొత్తంలో పెట్టుబటి పెట్టింది. అమెరికా, కెనడాలో మోటల్ 6కు సుమారు 1500కుపైగా హోటళ్లు ఉన్నాయి. మరోవైపు ఐపిఒ సన్నాహాల్లో ఉన్న వేళ ఓయో దీన్ని కొనుగోలు చేయడం విశేషం.




# బ్లింకిట్-బిగ్‌బాస్కెట్‌ల మధ్య పోరు..

**వాషింగ్టన్, సెప్టెంబరు 21:** ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లైన్ బ్లింకిట్-బిగ్ బాస్కెట్‌లు ఐఫోన్ 16 విక్రయాలు ప్రారంభించాయి. ఎంపిక చేసిన ప్రాంతాల్లో 10 నిమిషాల్లోనే డెలివరీ అందిస్తున్నట్లు తెలిపాయి. దీంతో ఈ ప్లాట్‌ఫామ్‌ల మధ్య పోరు మొదలైందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వైరల్‌గా మారాయి. ఈ విషయానికి ఇరు కంపెనీల సిఇఒలు సెల్ఫీతో సమాధానం చెప్పారు. ఐఫోన్ 16 డెలివరీలతో క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లైన్ బిగ్ బాస్కెట్ వర్సెస్ బ్లింకిట్‌ల మధ్య పోరు మొదలైంది అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అంతే ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. దీనిపై బ్లింకిట్ సిఇఒ ఆల్బిందర్ ధిండా స్పందించారు. బిగ్ బాస్కెట్ సిఇఒ హరి మీనన్‌తో కలిసి దిగిన ఫోటోను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఏ యుద్ధం? అంటూ క్యాప్షన్ జోడించారు. మరో ఫోటోను హరి మీనన్ రీ ట్వీట్ చేస్తూ యుద్ధం కాదు, మేమిద్దరం ఎప్పటికీ మంచి స్నేహితులం అని రాసుకొచ్చారు. అంతే ఈ పోస్ట్ నెటిజన్లను ఆకర్షించింది. ఇద్దరి సిఇఒలస్నేహాన్ని కొనియాడుతూ కామెంట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇరు సంస్థలు క్విక్ కామర్స్ విభాగంలో రాణిస్తున్నాయి. మరోవైపు జెప్టో కూడా 10 నిమిషాల్లో ఐఫోన్ 16ను డెలివరీ చేసే సేవల్ని ప్రారంభించినట్లు ప్రకటించింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Superior Printers (P) Ltd. and published at plot No. 4 - 40/1, Alugunoor, Karimnagar-505527, Ph:2223355, 2277034, 35, FAX:2277036 ; Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. RNI No.APTEL/2001/7563.Postal Licence Regd. No. H/KAR/89/12-14